

ది గ్రేట్ వైజాగ్ షాపింగ్ ఫెస్టివల్ ప్రారంభం

- 60 వరకూ స్టాళ్ల ఏర్పాటు

సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న 'ది గ్రేట్ వైజాగ్ షాపింగ్ ఫెస్టివల్'ను ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో గురువారం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ఆర్థికాభివృద్ధిలో, స్వర్ణాంధ్ర సాధనలో జీఎస్టీ 2.0 గేమ్ ఛేంజర్‌గా నిలుస్తోందన్నారు. అనంతరం ఫెస్టివల్‌లో ఏర్పాటుచేసిన 60 స్టాళ్లను సందర్శించారు. ఒక స్టాల్‌లో ఏర్పాటుచేసిన ద్విచక్ర వాహనాన్ని కలెక్టర్ నడిపారు. ఫెస్టివ్‌ల్‌లో కార్లు, ద్విచక్ర వాహనాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, గృహోపకరణాలతో పాటు ఫుడ్‌స్టాల్స్ ఏర్పాటుచేశారు. ఈ నెల 19వ తేదీ వరకు ఫెస్టివల్ కొనసాగనున్నది.

-8లో



ఫెస్టివల్ ప్రారంభం సందర్భంగా బెలూన్లు ఎగురవేస్తున్న కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్. చిత్రంలో రవాణా శాఖ అధికారి శ్రీనివాసరావు ఉన్నారు.

చెలరేగిన ఆసీస్ ఓపెనర్లు

- కెప్టెన్ అలిసా హిలి అజేయ సెంచరీ
- బంగ్లాదేశ్‌పై పది వికెట్ల తేడాతో విజయం

విశాఖపట్నం-స్పోర్ట్సు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళల వన్డే ప్రపంచకప్ టోర్నీలో భాగంగా గురువారం పీఎం పాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను ఆస్ట్రేలియా పది వికెట్ల తేడాతో ఓడించింది. ఆసీస్ ఓపెనర్, కెప్టెన్ అలిషా హిలి అజేయ సెంచరీ (113 నాటౌట్; 20 బౌండరీలు), మరో ఓపెనర్ లిచ్ ఫీల్డ్ భారీ హాఫ్ సెంచరీ (84 నాటౌట్; 12 ఫోర్లు, 1 సిక్సర్)తో చెలరేగారు. ఆసీస్ బ్యాటర్లను ఏ దశలోనూ బంగ్లాదేశ్ బౌలర్లు నిలువరించలేకపోయారు. బంగ్లాదేశ్ తమ ముందు ఉంచిన 199 పరుగుల విజయలక్ష్యాన్ని కేవలం 24.5 ఓవర్లలో చేరుకున్నారు. అంతకు ముందు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 198 పరుగులు చేసింది. టాప్ ఆర్డర్‌లో శోభన అక్తర్ (66 నాటౌట్), రుబ్యా హైదర్ (44), షర్మిన్ అక్తర్ (19) మినహా మిగిలినవారంతా ఘోరంగా విఫలమయ్యారు. ఆరుగురు బ్యాటర్లు రెండెంకల స్కోరు కూడా చేయకుండానే పెవిలియన్ బాటపట్టారు.



ఆసీస్ ఓపెనర్లు అలిషా హిలి, లిచ్ ఫీల్డ్

మొక్కుబడిగా చెత్త సేకరణ!

క్లాప్ వాహనాల ఇష్టారాజ్యం

- కాంట్రాక్టర్ జీతాలు చెల్లించడం లేదంటూ తరచూ విధులు బహిష్కరిస్తున్న డ్రైవర్లు
- మిగిలిన రోజుల్లో మూడు ట్రిప్పులు తిరగాల్సి ఉండగా ఒకటి, రెండింటితో సరి
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- నగరంలో దిగజారుతున్న పారిశుధ్యం
- ఎంఎస్‌ఎఫ్‌ల్లో కాకిలెక్కలతో అధికారుల కళ్లకు గంతలు
- ప్రతినెలా క్లాప్ వాహనాల కాంట్రాక్టర్‌కు రూ.3.9 కోట్లు చెల్లింపు



జీవీఎంసీ పరిధిలో క్లాప్ వాహనాలు	సుమారు 610
ఈ-ఆటోలు	65
ఒక వాహనం రోజుకు తిరగాల్సిన ట్రిప్పులు	3
ఒక ట్రిప్పులో తీసుకువెళ్లాల్సిన చెత్త	700 కిలోలు
ఒక్కో వాహనానికి జీవీఎంసీ చెల్లించే మొత్తం	రూ.64 వేలు
వాహనాల కాంట్రాక్టర్‌కు ఒక నెలకు మొత్తం	రూ.3.9 కోట్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ పరిధిలో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించాల్సిన క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) వాహనాల పనితీరు నానాటికీ తీసికట్టుగా మారింది. వాహనాల డ్రైవర్లకు కాంట్రాక్టర్ సక్రమంగా జీతాలు చెల్లించకపోవడంతో వారంతా తరచూ విధులు బహిష్కరిస్తున్నారు. దానివల్ల ఆరోజు చెత్తసేకరణ నిలిచిపోతోంది. మిగిలిన రోజుల్లో కూడా అధికారుల పర్యవేక్షణ లోపించడంతో చెత్తసేకరణ తూతూమంత్రంగా జరుగుతోంది. దీంతో ప్రజలు తమ ఇళ్లలో చెత్తను రోడ్లపక్కన, గెడ్డల్లోనూ పడేస్తున్నారు.

జీవీఎంసీ పరిధిలో గల 610 క్లాప్ వాహనాలు ఆదివారం మినహా ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించాలి. ఇందుకోసం ప్రతి వెయ్యి ఇళ్లకు ఒక వాహనాన్ని కేటాయించారు. ఒక్కో వాహనం మూడు ట్రిప్పుల్లో తమకు కేటాయించిన ప్రాంతంలోని ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి సమీపంలోని ఎంఎస్‌ఎఫ్‌కు తరలించాలి. కానీ ప్రస్తుతం నగరంలో అందుకు విరుద్ధమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. క్లాప్ వాహనాల పనితీరుపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దాంతో క్లాప్ వాహనాలు మూడు ట్రిప్పులకు బదులు ఒకటి, రెండు ట్రిప్పులతోనే సరిపెట్టేస్తున్నాయి. క్లాప్ వాహనాలపై పర్యవేక్షణ బాధ్యతను వార్డు సచివాలయంలోని శానిటేషన్ కార్యదర్శులకు జీవీఎంసీ అధికారులు అప్పగించినా వారు అందుకు అంగీకరించడం లేదు. తమ జాబ్‌చార్ట్‌లో క్లాప్ వాహనాల పర్యవేక్షణ లేనందున ఆ బాధ్యతలను తీసుకోబోమని తెగేసి చెబుతున్నారు. అధికారులు ప్రత్యామ్నాయం చూడకుండా శానిటేషన్ సెక్రటరీలే ఆ బాధ్యత చూడాలంటూ పట్టుబడుతున్నారు. దీనివల్ల క్లాప్ వాహనాలపై పర్యవేక్షణ గాలికి వదిలేసినట్టయింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వాహనాల కాంట్రాక్టర్‌ను, డ్రైవర్లను అడిగేవారు లేకుండాపోయారు. ఒక్కో ట్రిప్పులో కనీసం 700 కిలోలు చెత్త ఉండాలనే నిబంధన ఉన్నప్పటికీ 250-300

... మిగతా 6వ పేజీలో

షీలానగర్-సబ్బవరం హైవేకు పచ్చజెండా

కర్నూలు నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన మోదీ

- రూ.960 కోట్లు మంజూరు
- ఇప్పటికే పనులు మొదలు
- సరుకు రవాణా వాహనాలు నేరుగా పోర్టుకు వెళ్లేందుకు ఉపయుక్తం
- నగరంపై కాస్త తగ్గనున్న ట్రాఫిక్ ఒత్తిడి



సబ్బవరం సమీపంలో హైవే పనులు

- వాల్తేరు డివిజన్‌లో పూర్తయిన రైల్వే లైన్లను జాతికి అంకితం చేసిన నరేంద్రమోదీ

విశాఖపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని షీలానగర్ నుంచి అనకాపల్లి జిల్లా సబ్బవరం వరకూ ఆరు వరుసల జాతీయ రహదారి నిర్మాణానికి ప్రధాని నరేంద్రమోదీ గురువారం కర్నూలు జిల్లా పర్యటన సందర్భంగా శంకుస్థాపన చేశారు. విశాఖపట్నం పోర్టుకు వచ్చే వాహనాల వల్ల ప్రమాదాలతో పాటు ఇబ్బందులు కూడా ఎదురవుతున్న నేపథ్యంలో సరకు రవాణాకు ఉపయోగపడేలా ఈ రహదారిని నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టుకు ఇప్పటికే రూ.960 కోట్లు

... మిగతా 6వ పేజీలో

రెవెన్యూ సిబ్బందికి డీఆర్వో ఇండెంట్



డీఆర్వో భవానీశంకర్



ఆర్డీవో శ్రీలేఖ

- కలెక్టర్‌కు విశాఖ ఆర్డీవో ఫిర్యాదు
- నెలవారీ నిత్యావసర సరుకులు తెప్పించుకుంటున్నారని ఆరోపణ

విశాఖపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీశంకర్‌పై విశాఖ ఆర్డీవో పి.శ్రీలేఖ గురువారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం రెవెన్యూ వర్గాల్లో కలకలం రేపింది. డీఆర్ఓ తన ఇంటికి అవసరమైన నిత్యావసర సరుకులను సిబ్బంది ద్వారా తెప్పించుకుంటున్నారని ఆర్డీవో తన ఫిర్యాదులో పేర్కొన్నారు. విశాఖలో డీఆర్వో ఇంటితోపాటు శ్రీకాకుళంలో ఉన్న ఆయన కుటుంబం కోసం గాజువాక, పెందుర్తి తహశీల్దారు కార్యాలయాల సిబ్బందికి చెప్పి రూ.20 వేల చొప్పున సరుకులు తెప్పించుకుంటున్నారని ఆరోపించారు. ఇంకా సీతమ్మధార, పద్మనాభం తహశీల్దారు కార్యాలయాల్లో పనిచేసే సిబ్బందికి కూడా సరుకుల కోసం ఇండెంట్ పెడుతున్నట్టు తనకు సమాచారం ఉందని ఫిర్యాదులో ప్రస్తావించారు. చింతపండు, పసుపుకొమ్ములు, గోధుమ పిండి, వంటనూనెలు, ముఖానికి రాసుకునే క్రీములు, బట్టల క్లిప్పులు వంటివి సరుకుల జాబితాలో ఉన్నట్టు ఆర్డీవో పేర్కొన్నారు. ఈ విధంగా చేయడం వల్ల రెవెన్యూ శాఖ ప్రతిష్ఠ దెబ్బతింటుందని, ఇంకా సిబ్బంది అవినీతికి పాల్పడతారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని కలెక్టర్‌ను ఆమె కోరారు. కాగా పెందుర్తి మండలంలో అంబేడ్కర్ విగ్రహం తొలగింపు వ్యవహారంలో ఆర్డీవో సహా ముగ్గురికి కలెక్టర్ షోకాజ్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఫిర్యాదు కాపీ బయటకు రావడం గమనార్హం.

బాణసంచా దుకాణదారులు నిబంధనలు పాటించాలి

- సీపీ శంఖబ్రతబాగ్చి



విశాఖపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా నగరంలో బాణసంచా విక్రయించే దుకాణాలు నిబంధనలు తప్పకుండా పాటించాలని సీపీ శంఖబ్రత బాగ్చి సూచించారు. బాణసంచా నిల్వ, దుకాణాల ఏర్పాటు, విక్రయాల్లో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

... మిగతా 6వ పేజీలో

అంతర్జాతీయ ఎయిర్ కార్గో లేనట్టే!!

పారిశ్రామిక వేత్తల నుంచి ఎప్పటినుంచో డిమాండ్

- ఇప్పటికీ కార్యరూపం దాల్చని వైనం
- భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి వస్తే విశాఖ నుంచి నిలిచిపోనున్న పౌర విమానాల రాకపోకలు
- పలాసలో కార్గో విమానాశ్రయం నిర్మాణానికి భూసేకరణ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ కార్గో (సరకు) రవాణా ఇక లేనట్టే. ఐదు విమానాలు ఉన్నప్పుడు అవకాశం కల్పించాల్సిందిగా కోరడం జరిగింది. ఇప్పుడు వాటి సంఖ్య రెండుకు పడిపోయింది. కొద్ది నెలల్లో విమానాశ్రయం కూజడా మూతపడనున్నది.

నగరానికి 45 కి.మీ. దూరాన భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం శరవేగంతో పనులు పూర్తి చేసుకుంటోంది. వచ్చే జూన్ నాటికి పూర్తవుతుందని, సెప్టెంబరు నుంచి విమానాల రాకపోకలు మొదలవుతాయని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఆ విమానాశ్రయం మొదలైతే విశాఖపట్నంలో విమానాశ్రయంలో పౌర విమానాల రాకపోకలు ఆపేస్తారు. ఈ విమానాశ్రయాన్ని ఇకపై పూర్తి నేవీ అవసరాలకే ఉపయోగించుకుంటారు. ఈ నేపథ్యంలో విశాఖపట్నం విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ సరకు రవాణా అనేది కలగానే మిగిలిపోనుంది.



కేంద్ర మంత్రి ఆదేశించినా...

కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి రామ్మోహన్‌నాయుడు ఈ ప్రాంతానికి చెందినవారే. దగ్గుబాటి పురందేశ్వరి విశాఖ ఎంపీగా ఉన్నప్పుడు విశాఖ విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ సరకు రవాణాకు అనేక ప్రయత్నాలు చేశారు. అవసరమైన సిబ్బందిని మంజూరు చేయించారు. ఆ తరువాత ఎంపీగా వచ్చిన కంభంపాటి హరిబాబు డ్రగ్ కంట్రోల్ అథారిటీని నియమించారు. ప్రస్తుత ఎంపీ శ్రీభరత్ కూడా మంత్రి రామ్మోహన్‌నాయుడితో మాట్లాడించి తగిన ఆదేశాలు ఇప్పించారు. అన్ని చేసినా ఒక్క టన్ను కూడా ఇతర దేశాలకు వెళ్లలేదు. పంపించే సరకు భద్రంగా గమ్యం చేరడానికి కస్టోడియన్ బాధ్యత తీసుకునేవారు ఎవరూ ముందుకు రాలేదు. అదొక కారణమైతే విశాఖ నుంచి విదేశాలకు వెళ్లే విమానాల సంఖ్య క్రమంగా పడిపోవడం మరో కారణం. ఇక్కడి నుంచి గతంలో సింగపూర్, మలేషియా, బ్యాంకాక్, శ్రీలంక, దుబాయ్‌లకు విమానాలు నడిచేవి. ఈ ఏడాది మే నుంచి మలేషియా, బ్యాంకాక్ సర్వీసులు ఆగిపోయాయి. కరోనాసమయంలో ఆగిపోయిన దుబాయ్, శ్రీలంక విమానాలను తరువాత పునరుద్ధరించలేదు. ఇప్పుడు సింగపూర్‌తో పాటు అబుదాబీకి ఇండిగో నడుపుతున్న విమానాలే మిగిలాయి. రెండు నెలల క్రితం విశాఖ ఎంపీ నిర్వహించిన సమావేశంలో అంతర్జాతీయ సరకు రవాణా గురించి ప్రశ్నిస్తే...అంత పెద్దమొత్తంలో ఏమీ లేదని అధికారులు తేల్చి పడేశారు. ఇంకో ఎనిమిది నెలల్లో పౌర విమానాలు ఆగిపోయే తరుణంలో ప్రారంభించడం దండగ అనే అభిప్రాయం అధికారుల్లో ఉంది.

పలాసలో కార్గో విమానాశ్రయం

విశాఖపట్నంలో రెండు

... మిగతా 6వ పేజీలో

నేడు ఏసీబీ డీజీ రాక

- ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల అవినీతిపై ఫిర్యాదులు స్వీకరణ



ఏసీబీ డీజీ అతుల్‌సింగ్

విశాఖపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డైరెక్టర్ జనరల్ అతుల్‌సింగ్ శుక్రవారం నగరానికి రానున్నారు. చినగదిలిలోని ఏసీబీ కార్యాలయంలో ఏసీబీ ఆంధ్రా రీజియన్ పరిధిలోని డీఎస్పీలు, సీఐలతో ఆయన సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఏసీబీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తున్నా, చేయాల్సిన పనిని ఆర్థిక ప్రయోజనం ఆశించి తొక్కిపెడుతున్నా, ఆదాయానికి మించి ఆస్తులు కూడగట్టినా ప్రజలు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. అధికారులు, ఉద్యోగుల అవినీతికి సంబంధించిన సమాచారం అందిస్తే దాని ఆధారంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఏసీబీ అధికారులు తెలిపారు. సమాచారం ఇచ్చినవారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

సచివాలయాలపై దృష్టి

- పాలనను గాడిలో పెట్టేందుకు మండలానికొక డిప్యూటీ ఎంపీడీవో స్థాయి అధికారి నియామకం
- సీనియర్ అసిస్టెంట్లకు డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పించేందుకు ప్రతిపాదనలు
- సుమారు 50 మందితో జాబితా



విశాఖపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పాలనాపరంగా గ్రామ సచివాలయాలను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం పలు సంస్కరణలు తీసుకువస్తోంది. దీనిలో భాగంగా సచివాలయాలపై పర్యవేక్షణ కోసం మండలానికి ఒక డిప్యూటీ ఎంపీడీవోను నియమించనున్నది. గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన సచివాలయాల వ్యవస్థలో జవాబుదారీతనం లేదనే వాదన ఉంది. దీనిని పరిగణనలోకి తీసుకుని కూటమి ప్రభుత్వం సచివాలయాలను సరిదిద్దే కార్య క్రమానికి నడుంబిగించింది. సచివాలయాల్లో మిగులు సిబ్బందిని ఇతర విభాగాలకు పంపింది. ఇంకా రేషనలైజేషన్ ద్వారా కొన్ని విభాగాలకు చెందిన కార్యదర్శులకు రెండేసి సచివాలయాల్లో బాధ్యతలు అప్పగించారు. అర్హత మేరకు డిజిటల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించారు. అయినా సచివాలయాలపై అనేక విమర్శలు, ఆరోపణలు వస్తున్నాయి. కొంతమంది కార్యదర్శులు, సర్వేయర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వీఆర్వోలు, సర్వేయర్లు ఎక్కువ సమయం తహశీల్దారు కార్యాలయాల్లోనే ఉంటున్నారనే వాదన ఉంది. ఈ నేపథ్యంలో సచివాలయాల పర్యవేక్షణ బాధ్యత ఒక డిప్యూటీ ఎంపీడీవో స్థాయి అధికారికి అప్పగించాలని పంచాయతీరాజ్ శాఖ నిర్ణయించింది. మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆధీనంలో డిప్యూటీ ఎంపీడీవో విధులు నిర్వర్తించేలా పంచాయతీరాజ్ కమిషనరేట్ విధి విధానాలు

... మిగతా 6వ పేజీలో

సింహాద్రినాథుడికి సిరి సంపెంగలతో పూజ



సింహాచలం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనారసింహునికి ఆర్జిత సేవల్లో భాగంగా గురువారం సిరి సంపెంగలతో పూజ చేశారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి సిరి సంపెంగలను తీసి భక్తులతో స్పృశింపజేసి బేడా మండప ప్రదక్షిణ జరిపారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు సిరి సంపెంగలతో పూజ చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. తరువాత అదే వేదికపై స్వామి వారికి ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

ఆలయ పైకప్పు మరమ్మతులు పూర్తి



మరమ్మతులు పూర్తయిన ఆలయం పైకప్పు

సింహాచలం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న ఆలయం పైకప్పు మరమ్మతులు పూర్తయ్యాయి. సుమారు నాలుగు దశాబ్దాలుగా ఆలయం పైకప్పుపై పలుచోట్ల లీకులు ఏర్పడడంతో వర్షం పడితే నీరు లోపలికి చేరేది. దీనివల్ల భక్తులతో పాటు అర్చకులు, అధికారులు ఇబ్బందులు పడేవారు. లీకుల మరమ్మతుకు అధికారులు లక్షలాది రూపాయలు వెచ్చించి శాండ్ బ్లాస్టింగ్ పనులు చేయించినప్పటికీ ఫలితం లేకపోయేది. ఎట్టకేలకు పురావస్తు శాఖ డైరెక్టర్ మునిరత్నం రెడ్డి పర్యవేక్షణలో పూణేకు చెందిన వెంకటేశ్వర ఆధ్యాత్మిక ఛారిటబుల్ ట్రస్టు రూ. 5 కోట్లు వెచ్చించి నాలుగు నెలలు పాటు శ్రమించి మరమ్మతులు పూర్తి చేశారు. సనాతన భారతీయ విధానంలో కరక్కాయ, బెల్లం, బెండకాయలు, తదితరాలను ఆఫ్రికా నుంచి రప్పించిన ప్రత్యేక మృత్తికలో కలిపి నీటిలో నానబెట్టి జిగురు వంటి కాంక్రీట్‌ను ఆలయం పైకప్పుపై వేశారు. దానిపై ప్రత్యేకమైన టైల్స్ బిగించారు. ప్రస్తుతం ఈ పనులన్నీ పూర్తయ్యాయి.

సీపీఆర్ విధానంపై అవగాహన

తగరపువలస, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సంగివలస ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల విద్యార్థులకు గురువారం సీపీఆర్ (హృదయ పునరుద్ధరణ) విధానంపై అవగాహన కల్పించారు. ఎనస్తీషియా వైద్యులు, ఇతర సిబ్బంది సీపీఆర్ ప్రాక్టికల్ ప్రదర్శనలను విద్యార్థులకు చేసి చూపించారు. అలాగే గుండెపోటు వచ్చినప్పుడు తీసుకోవలసిన తక్షణ చర్యల గురించి వివరిచారు.

300 మందికి దంత వైద్య పరీక్షలు



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

తగరపువలస, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కృష్ణా డిగ్రీ కళాశాలలో సంగివలస ఎన్ఆర్ఐ వైద్యులు గురువారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని కళాశాల కరస్పాండెంట్ బి. నరసింగరావు ప్రారంభించారు. వైద్యులు విద్యార్థులకు పరీక్షలు చేసి, దంత సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సతీశ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణదారులు నిబంధనలు పాటించాలి

... 5వ పేజీ తరువాయి

తప్పవన్నారు. వ్యాపారి లైసెన్స్ కోసం దరఖాస్తు చేస్తున్నప్పుడే ఏ ప్రాంతంలో ఏర్పాటుచేస్తున్నారు, షెడ్ మ్యాప్, ఇత్యాది వివరాలు సమర్పించాలన్నారు. జీవీఎంసీ, అగ్నిమాపక శాఖ, విద్యుత్ శాఖల నుంచి ఎన్‌ఓసీ తప్పనిసరి అని, దుకాణం ఏర్పాటుచేసే వ్యక్తికి 18 ఏళ్లు నిండి ఉండడంతోపాటు జీఎస్‌టీ సర్టిఫికెట్ కలిగివుండాలన్నారు. దుకాణాలు నర్సింగ్‌హోమ్‌లు, ఆరోగ్య కేంద్రాలు, విద్యాసంస్థలు, మతపరమైన ప్రదేశాలకు కనీసం వంద మీటర్లు అవతల ఉండాలన్నారు. ప్రతిదుకాణం వద్ద తగినంత ఇసుక బకెట్లు, నీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. దీపావళి రోజున రాత్రి ఎనిమిది నుంచి పది గంటల వరకు మాత్రమే బాణసంచా కాల్చేందుకు అనుమతిస్తామన్నారు. బాణసంచా అక్రమ నిల్వ, విక్రయాలకు సంబంధించి ప్రజలు డయల్ 100 లేదంటే 7995095799 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సీపీ కోరారు.

సచివాలయాలపై దృష్టి

... 5వ పేజీ తరువాయి

రూపొందించింది. ఉమ్మడి జిల్లాలోని 39 మండలాల్లో 39 మంది డిప్యూటీ ఎంపీడీవోలను నియమించనున్నారు. ప్రస్తుతం అంతమంది డిప్యూటీ ఎంపీడీవోలు లేనందున పంచాయతీరాజ్ శాఖలో సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించనున్నారు. దీనికి సంబంధించి సుమారు 50 మందితో సీనియారిటీ జాబితాను పంచాయతీరాజ్ శాఖ అధికారులు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపారు. ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకున్న తరువాత అర్హులకు పదోన్నతులు ఇవ్వనున్నారు. గ్రామ సచివాలయాల పర్యవేక్షణ బాధ్యతను ఒక అధికారికి అప్పగించాలన్న పంచాయతీ రాజ్ శాఖ నిర్ణయాన్ని ఉద్యోగులు స్వాగతిస్తున్నారు. ప్రస్తుతం సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను ఆయా శాఖల అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇక నుంచి ఆయా శాఖల అధికారుల అజమాయిషీ ఉన్నప్పటికీ ప్రత్యేకించి డిప్యూటీ ఎంపీడీవో స్థాయి అధికారిని నియమిస్తే పాలన గాడిలో పడుతుందని ఉద్యోగులు అంటున్నారు. కేవలం ఒక అధికారిని నియమించి వదిలేయకుండా ఆయన పరిధిలో సిబ్బందిని నియమించి జాబ్‌చార్టు రూపొందిస్తే ఫలితం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అంతర్జాతీయ ఎయిర్ కార్గో లేనట్టే!!

... 5వ పేజీ తరువాయి

పోర్టులు ఉన్నాయి. విశాఖపట్నం స్టీల్ ప్లాంటు ఉంది. మందులు తయారీచేసి విదేశాలకు పంపే ఫార్మా కంపెనీలు వందల సంఖ్యలో ఉన్నాయి. విశాఖపట్నం నుంచి రొయ్యలు, టూనా చేపలు పంపించే సీఫుడ్ ఎక్స్‌పోర్టర్లు ఉన్నాయి. విదేశాలకు రెడీమేడ్ దుస్తులు పంపించే బ్రాండిక్స్ కర్మాగారం ఉంది. ఇలాంటిచోట సరకులు పంపడానికి ప్రత్యేక విమానాశ్రయం నిర్మించాల్సి ఉండగా...ఒక్కరోజు కూడా ఆ ప్రతిపాదన చేయలేదు. ఎగుమతిదారులు సిద్ధంగా ఉన్నా విమానాల్లో పంపడానికి అవకాశం ఇవ్వలేదు. ఇప్పుడు విశాఖ నుంచి 195 కి.మీ. దూరానున్న పలాసలో ప్రత్యేకంగా కార్గో విమానాశ్రయం నిర్మించాలని ప్రతిపాదించారు. భూ సర్వేకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. భూముల సేకరణకు ఇటీవల ప్రజాభిప్రాయ సేకరణ కూడా నిర్వహించారు. స్థానిక రైతులు వ్యతిరేకించారు. పలాసకు సరైన బస్టాండ్ లేదు గానీ విమానాశ్రయం కడతారా?...అంటూ చాలా మంది ప్రశ్నించారు. పలాసలో కార్గో విమానాశ్రయం వస్తే జీడిపప్పును నేరుగా విదేశాలకు ఎగుమతి చేసుకోవచ్చునని, ఇంకా మరిన్ని కంపెనీలు వస్తాయని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. విస్తృత అవకాశాలున్న విశాఖపట్నాన్ని కాదని పలాసలో పెట్టడంపై పారిశ్రామిక వర్గాలు పెదవి విరుస్తున్నాయి.

అనధికారికంగా బాణసంచా దుకాణాలు

- మధురవాడ పరిసరాల్లో విచ్చలవిడిగా ఏర్పాటు
- నివాసాల మధ్య షెడ్‌ల నిర్మాణం
- అధికారుల పర్యవేక్షణ కరువు
- భయాందోళనలో స్థానికులు



దుకాణం కోసం అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన రేకుల షెడ్‌ను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

విశాఖపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ పరిసరాల్లో కొందరు ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ఐదో వార్డులోని వైఎస్సార్ కాలనీకి వెళ్లే రహదారిని ఆనుకుని కొత్తగా నిర్మించిన పెట్రోల్ బంకు, ప్రైవేటు పాఠశాల వసతి గృహం, వందలాది మంది నివసిస్తున్న అపార్టుమెంట్‌ను ఆనుకుని భారీస్థాయిలో మందుగుండు సామాగ్రి విక్రయానికి రేకుల షెడ్ ఏర్పాటు చేశారు. దీనికి ఎటువంటి అనుమతులు లేవు. నివాసాల మధ్య అనుమతులు లేకుండా దుకాణం ఏర్పాటు చేస్తుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై జీవీఎంసీ ఇన్‌చార్జి ఏసీపీ హరిదాసు, పీఎంపాలెం సీఐ బాలకృష్ణ, విద్యుత్ శాఖాధికారులను వివరణ కోరగా మూడు శాఖల నుంచి కూడా ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. కాగా స్థానికులు దుకాణం ఏర్పాటు గురించి జోన్-2 కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో సిబ్బంది తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్‌లో కొంతభాగాన్ని గురువారం తొలగించారు. మిగిలిన షెడ్‌ను నిర్వాహకులు స్వయంగా తొలగించుకోవాలని చెప్పారు. అనధికార దుకాణాలు మధురవాడ పరిసరాల్లో చాలా వరకు ఉన్నాయి.



భీమిలిలో బీసీ బాలుర వసతిగృహాన్ని సందర్శించిన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల బృందం



అడవివరంలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

తల్లిదండ్రుల సహకారంతోనే మెరుగైన ఫలితాలు

- పదో తరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యం
- గ్రామ సందర్శన కార్యక్రమంలో డీఈఓ ప్రేమ్‌కుమార్

సింహాచలం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి విద్యార్థుల విజయంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని డీఈఓ ప్రేమ్‌కుమార్ అన్నారు. గురువారం 98వ వార్డులో జరిగిన గ్రామ సందర్శన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుకునేందుకు సమయం కేటాయించాలని, అందుకు అనుకూలమైన పరిస్థితులు ఇంట్లో కల్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. వత్తిడి చేసి పిల్లల ఆరోగ్యంపై అశ్రద్ధ చూపరాదన్నారు. పాఠ్యాంశాల్లో సందేహాలు వస్తే నివృత్తి చేసేందుకు ఉపాధ్యాయులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని చెప్పారు. అడివివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఇమంది పైడిరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

లక్ష్మీపురంలో...

భీమునిపట్నం (రూరల్) : మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఉపాధ్యాయులు గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మీపురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం దంతంశెట్టి సత్యారావు ఆధ్వర్యంలో పరిసర గ్రామాల ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు డి. శ్రీనివాసరావు (తాటితూరు,) పద్మజ (మజ్జివలస,) జయలక్ష్మి (మజ్జిపేట) ఉపాధ్యాయులతో కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంఈఓ ఎం. శివరాణి ప్రారంభించారు. పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించడానికి విద్యాశాఖ ఈకార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతిరోజూ పాఠశాల విడిచిపెట్టిన తర్వాత సాయంత్రం 6 నుంచి 8 వరకు ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడి, చదువుపై ఆరా తీయాలి. దీని వల్ల విద్యార్థుల తల్లిదండ్రుల్లో జవాబుదారీతనం వచ్చి, పరీక్షా ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించడానికి అవకాశం కలుగుతుందని అధికారుల ఉద్దేశం.

రేవిడిలో..

పద్మనాభం : రేవిడిలో కూడా ఉపాధ్యాయులు గ్రామ సందర్శన నిర్వహించారు.విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థుల ప్రగతి, వారి ప్రవర్తనను, చదువుతున్న విధానాన్ని వివరించారు. ప్రతి వారం కార్యక్రమం చేపట్టనున్నట్టు ఎంఈఓ రమణ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వి. శంకరరావు, ఉపాధ్యాయులు కృష్ణారావు, ఎర్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నంలో...

భీమునిపట్నం: పట్టణంలోని బీసీ బాలుర వసతిగృహాన్ని పలు పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సందర్శించారు. అలాగే మంగమారిపేట, జయంతివారి అగ్రహారంలో కూడా పర్యటించారు. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి ప్రగతిని తల్లిదండ్రులకు వివరించారు.



లక్ష్మీపురంలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు



రేవిడిలో ఉపాధ్యాయుల గ్రామ సందర్శన

ఇండోర్ స్టేడియం అభివృద్ధికి కృషి

భీమునిపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం మాదిరిగా కుమ్మరిపాలెంలో వున్న ఇండోర్ స్టేడియం



స్టేడియం సమస్యలు తెలుసుకుంటున్న రవితేజ

అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గంటా తనయుడు, రవితేజ చెప్పారు. గురువారం ఆయన ఇండోర్ స్టేడియం, మినీ స్టేడియం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2018లో అప్పటి మంత్రి గంటా శ్రీనివాసరావు హయాంలో ఇండోర్ స్టేడియం నిర్మించామని గుర్తు చేశారు. గత వైసీపీ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, క్రీడాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. కాగా మినీ స్టేడియంలో ఒక రోజు టోర్నమెంట్ నిర్వహణకు జీవీఎంసీ అధికారులు రూ. 5 వేలు ఫీజు నిర్ణయించడాన్ని కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి, టీడీపీ నాయకుడు నూకరాజు, గొలగాని నరేంద్రకుమార్ ఆయన దృష్టికి తీసుకువచ్చారు. శాప్ ఆధీనంలో స్టేడియం ఉందని, దాన్ని జీవీఎంసీ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ అప్పలరాజు, టీడీపీ నాయకులు గాడు అప్పలనాయుడు, పాసి త్రినాథ్‌కుమార్, కనకల అప్పలనాయుడు, మారోజు సంజీవకుమార్, ఆవాల సూరిబాబు, భీమిలి నీడీ వెల్ఫేర్ సభ్యులు కాళ్ల సన్నీ, రాజేటి బసవ కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

లభించని వ్యక్తి ఆచూకీ

తగరపువలస, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గోస్తనీ నదిలో స్నానానికి దిగి గల్లంతైన తమ్మిన శ్రీనివాసరావు ఆచూకీ గురువారం కూడా లభించలేదు. రెండు రోజులుగా పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్ల సహకారంతో నదిలో గాలింపు చర్యలు చేపడుతున్నారు. పడవలో ఎనిమిది మంది ఈతగాళ్లు అనుమానం వచ్చిన ప్రాంతాల్లో వెతుకుతున్నారు.శ్రీను ఆచూకీ తెలియక కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

కోటి సంతకాల సేకరణను విజయవంతం చేయండి

ఎండాడ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎండాడ న్యాయ కళాశాల రోడ్డులో ఉన్న వైసీపీ కార్యాలయంలో గురువారం నాయకులు, కార్యకర్తలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అష్టలక్ష్మీ దేవాలయంలో పూజలు

కొమ్మాది, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అష్టలక్ష్మీ దేవాలయంలో ధన త్రయోదశి, దీపావళి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధాన అర్చకుడు చామర్తి శ్రీధరస్వామి తెలిపారు. 19న ధన త్రయోదశి నాడు అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించి, నాణేలతో అర్చన జరిపి ధనలక్ష్మీ హోమం, కుబేర హోమం నిర్వహిస్తామని చెప్పారు. 20న అమ్మవారికి కుంకుమార్చనలు, అష్టలక్ష్మీ హోమం నిర్వహించనున్నట్టు తెలిపారు.



మధురవాడలోని టిడ్కో కాలనీలో ర్యాలీ చేస్తున్న అధికారులు, కూటమి నాయకులు

సూపర్ జీఎస్టీపై అవగాహన ర్యాలీ



తగరపువలసలో ర్యాలీ చేస్తున్న వ్యాపారులు

మధురవాడ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) :జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని సుద్దగెడ్డ టిడ్కో గృహ సముదాయం వద్ద కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ ఆధ్వర్యంలో పీఎం ఆవాస యోజన, సూపర్ జీఎస్టీపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంగమ్మ మాట్లాడుతూ పీఎంఏవై పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు సొంత స్థలం ఉంటే ఇంటి నిర్మాణానికి కేంద్రం రూ. 1.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ. 1 లక్ష మంజూరు చేస్తాయని చెప్పారు. అలాగే ఇంటి నిర్మాణం తరువాత పీఎం సూర్యఘర్ పథకం కింద ఉచిత విద్యుత్‌తో పాటు కేంద్ర పథకాలన్నీ వర్తిస్తాయని తెలిపారు. అనంతరం కాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అలాగే సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై ర్యాలీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకట్రావు, హౌసింగ్ కార్పొరేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సీహెచ్ సత్తిబాబు, జోన్ -2 యూసీడీ ఏపీడీ శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : తగరపువలస కూడలిలో వ్యాపారులు, పోలీసులు సంయుక్తంగా జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బైపాస్ రోడ్డులో అండర్ పాత్ వే నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ సాగింది. కేంద్రం జీఎస్టీ నూతన శ్లాబ్‌లు ప్రకటించిన తర్వాత పలు వస్తువుల ధరలు తగ్గిపోయాయని, వాటి గురించి వినియోగదారులు తెలుసుకోవాలని వ్యాపారులు సూచించారు.



వుడా కాలనీలో రోడ్డుపై బైఠాయించిన చిరు వ్యాపారులు

వుడా కాలనీలో చిరు వ్యాపారుల నిరసన

మధురవాడ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 7వ వార్డు మిథిలాపురి వుడాకాలనీలో చిరు వ్యాపారులు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. టౌన్ ప్లానింగ్ అధికారులు తమ వద్ద నుంచి సరుకులను బలవంతంగా తీసుకుపోయారని ఆరోపిస్తూ సీఐటీయూ నాయకులతో కలిసి ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు రాజ్‌కుమార్, అప్పలరాజు మాట్లాడుతూ గతంలో ఆపరేషన్ లంగ్స్ పేరుతో కాలనీలోని చిరు వ్యాపారుల పొట్ట కొట్టిన అధికారులు గురువారం మళ్లీ వచ్చి ఫుట్‌పాత్ మార్జిన్ విడిచిపెట్టి నేలపై, తోపుడు బళ్లపై వ్యాపారాలు చేసుకుంటున్న వారి సరుకులను తీసుకు వెళ్లడం అన్యాయమన్నారు. వ్యాపారులు అప్పులు చేసి సరుకులు కొని వ్యాపారం చేస్తున్నారని, వాటిని తీసుకుపోతే వారి అప్పులు ఎవరు తీర్చుతారని ప్రశ్నించారు. అనంతరం వ్యాపారులు, సీఐటీయూ నాయకులు రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. పీఎంపాలెం పోలీసులకు సమాచారం అందడంతో వారు సంఘటనా స్థలానికి వచ్చి ఆందోళనకారులకు నచ్చజెప్పారు. జీవీఎంసీ అధికారులతో మాట్లాడి వ్యాపారులకు సరుకులను తిరిగి ఇప్పించారు. దీంతో వారు ఆందోళన విరమించారు.

అనంతుని పవిత్రోత్సవాలు ప్రారంభం



ఉత్సవాల్లో భాగంగా మేదినీ దేవతకు పూజలు చేస్తున్న అర్చకులు

పద్మనాభం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని అనంత పద్మనాభుని దేవస్థానంలో స్వామివారి పవిత్రోత్సవాలు గురువారం రాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షా బంధనం, మృత్సంగ్రహం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం కుంతీమాధవ స్వామి ఆలయం నుంచి పల్లకీపై గ్రామంలోని సంతబయలు కూడలికి మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి అంకురార్పణ చేపట్టారు. అక్కడ మేదినీ దేవతకు ప్రత్యేక పూజలు చేసి, మృత్తికను సేకరించారు. సేకరించిన మృత్తికను ఆలయ ప్రధాన అర్చకుడు పి. సీతారామాంజనేయస్వామి ఆధ్వర్యంలో ఆలయానికి తీసుకువచ్చారు. గ్రామం, దేవాలయం, పాడి పంటలు సుభిక్షంగా ఉండడానికి ఈ కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఎర్నాయుడు, మొకర అప్పలనాయుడు (అన్నమయ్య), పైడిరాజు, బుగత రాము, పద్దు, నరసింహనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పద్మనాభం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టిహకారం తీసుకోవాలని భీమిలి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీదేవి చెప్పారు. గురువారం పద్మనాభంలోని వెలుగు కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవం ముగింపు సభ జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణిలు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. అనంతరం అలాగే సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ జయఉమ, సూపర్‌వైజర్లు పార్వతి, ఉన్నీషా బేగం, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె. దామోదరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కె. రమణ పాల్గొన్నారు.

మొక్కుబడిగా చెత్త సేకరణ!

... 5వ పేజీ తరువాయి

కిలోలతో కూడా ఎంఎస్ఎఫ్‌లకు వాహనాలు వెళుతున్నాయి. ప్రతి వాహనానికి గతంలో జీపీఎస్‌ను అమర్చారు. దీనివల్ల ఆ వాహనం ఏ ప్రాంతంలో తిరిగింది, ఏ సమయంలో ఎంఎస్ఎఫ్‌కు వెళ్లింది...అనే వివరాలను అధికారులు జీపీఎస్‌తోపాటు ఎంఎస్ఎఫ్‌ల వద్ద ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల ద్వారా గుర్తించేవారు. కానీ ఇప్పుడు వాహనాల జీపీఎస్, ఎంఎస్ఎఫ్‌ల వద్ద ఏర్పాటుచేసిన సీసీకెమెరాలు కూడా పనిచేయడం మానేశాయి. దీంతో క్లాప్ వాహనాలు ఎన్ని ట్రిప్పులు తిరిగాయి, ఎంత బరువు చెత్తను తీసుకువెళ్లాయనే సమాచారం కోసం ఎంఎస్ఎఫ్‌ల వద్ద ఏర్పాటుచేసిన సిబ్బంది చేతిలోని రికార్డుల్లో నమోదుచేసే వివరాలే ఆధారం అవుతున్నాయి. క్లాప్ వాహనాల కాంట్రాక్టర్, డ్రైవర్లు ఆయా పాయింట్లలోని సిబ్బందిని మచ్చికచేసుకుని తమకు అనుకూలంగా వివరాలు నమోదుచేయించుకుంటున్నారు. వారిచ్చిన వివరాలు ఆధారంగా ప్రతినెలా బిల్లు కోసం జీవీఎంసీకి ఫైల్ పెడుతున్నారు.

కాంట్రాక్టర్‌కు డబ్బు.... నగరవాసులకు తిప్పలు

ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి చెత్తసేకరించాల్సిన క్లాప్ వాహనాలు వారంలో మూడు, నాలుగు రోజులు మాత్రమే వస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దీనివల్ల ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను నిల్వ ఉంచుకోలేక రోడ్లపైన, సమీపంలోని గెడ్డల్లోనూ పడేస్తున్నారు. దీనివల్ల పారిశుధ్య సమస్య తలెత్తుతోంది. గెడ్డల్లో చెత్తకారణంగా మురుగునీటి ప్రవాహం నిలిచిపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. మరోవైపు రోడ్డుపక్కన పడేస్తున్న చెత్తను పశువులు, కుక్కలు చిందరవందర చేస్తున్నాయి. చెత్త సేకరణ సక్రమంగా జరగనప్పటికీ కాంట్రాక్టర్‌కు మాత్రం జీవీఎంసీ ప్రతి నెలా రూ.3.9 కోట్లు బిల్లు చెల్లించాల్సిక తప్పని పరిస్థితి ఉంటోంది. అధికారులు కూడా క్లాప్ వాహనాలు ఎన్నిరోజులు పనిచేయలేదు, ఎన్ని ట్రిప్పులు తిరిగాయనే లెక్కలు వేయకుండా కాంట్రాక్టర్‌కు డబ్బు చెల్లించేస్తున్నారు. గతంతో పోల్చితే ఇటీవల కాలంలో నగరంలో పారిశుధ్యం దిగజారింది. ఈ విషయం గుర్తించే కమిషనర్ కేతన్‌గార్గ్ ఇటీవల క్లాప్ వాహనాల పనితీరుపై దృష్టిసారించారని అధికారులు చెబుతున్నారు. వార్డు శానిటేషన్ సెక్రటరీలు ప్రతిరోజూ ఏదో ఒక క్లాప్ వాహనం వెనుక తిరిగి ఇంటింటికీ చెత్తసేకరణ జరిగేలా చూడాల్సిందేనని ఆదేశాలు జారీచేశారు. అలాగే ప్రజలు చెత్తను క్లాప్ వాహనాలకు మాత్రమే ఇవ్వాలని, రోడ్లపై, గెడ్డల్లో పడేస్తే జరిమానా విధించాలని, ఒకవేళ వాహనాలు ఇళ్లకు వెళ్లకపోతే సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

షీలానగర్-సబ్బవరం హైవేకు పచ్చజెండా

... 5వ పేజీ తరువాయి

మంజూరయ్యాయి. షీలానగర్ నుంచి సబ్బవరం వరకూ ఆరు వరుసల్లో రహదారిని నిర్మించి అక్కడ జాతీయ రహదారికి అనుసంధానం చేస్తారు. అయితే ఈ పనులు ఇప్పటికే మొదలయ్యాయి. మరోవైపు షీలానగర్ నుంచి విశాఖపట్నం పోర్టు కనెక్టివిటీ కోసం నేషనల్ హైవే అథారిటీ ఇప్పటికే పనులు నిర్వహిస్తోంది. కాన్వెంట్ జంక్షన్ నుంచి ఆరు వరుసల మార్గాన్ని రూ.679 కోట్లతో చేపట్టింది. సరకు రవాణా వాహనాలు ఇకపై గాజువాక హైవే పైనుంచి నగరంలోకి రాకుండా, సబ్బవరం వద్ద కనెక్ట్ అయ్యే ఆరు వరుసల మార్గంలో షీలానగర్ వరకు వచ్చి, అక్కడి నుంచి విమానాశ్రయం పక్క మార్గంలో కాన్వెంట్ జంక్షన్ మీదుగా పోర్టుకు చేరుకుంటాయి. దీనివల్ల నగర ట్రాఫిక్‌పై ఒత్తిడి తగ్గుతుంది. ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గనుంది. సరకు రవాణా వాహనాలు 24/7 నడుపుకొనే వీలుంటుంది. ఇప్పటిలా ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు నగరంలోకి రాకుండా ట్రాఫిక్ ఆంక్షలు ఏమీ ఉండవు.

రైల్వే లైన్లు జాతికి అంకితం

విశాఖపట్నం నుంచి పొరుగు జిల్లాలకు కనెక్టివిటీ పెంచేందుకు రైళ్ల రద్దీని తట్టుకునేందుకు వీలుగా కొత్తవలస-విజయనగరం మధ్య నాలుగో లైన్ నిర్మాణానికి ప్రధాని శంకుస్థాపన చేశారు. దాంతో పాటు పెందుర్తి-నార్త్ సింహాచలం మధ్య రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేశారు. కొత్తవలస-కిరండూల్ మార్గంలో కొత్తవలస-బొడ్డవర, సిమిలిగుడ-గోరాపూర్ సెక్షన్ల మధ్య ఇప్పటికే డబ్లింగ్ పనులు పూర్తవ్వడంతో జాతికి అంకితం చేశారు. వీటి వల్ల ప్రయాణికులు,పర్యాటకుల కోసం అదనపు రైళ్లు నడిపే అవకాశం ఉంది. సరకు రవాణా కూడా సులభతరం కావడంతో పాటు వేగవంతం అవుతుంది.

పారిశుధ్య పనుల్లో మస్తర్ మాయాజాలం

- కార్మికులు విధులకు హాజరు కాకున్నా మేనేజ్
- వేతనాల సొమ్ము రూ.లక్షల్లో సొంత జేబులోకి..
- 22వ వార్డులో అధ్వానంగా పారిశుధ్యం
- పట్టించుకోని జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులు



పారిశుధ్య కార్మికుల హాజరు తీసుకొంటున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ (ఫైల్‌ఫొటో)

మద్దిలపాలెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డులో పారిశుధ్య కార్మికుల జీతాలు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విధులకు హాజరు కాని కార్మికుల వేతనాలను ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా వ్యవహరిస్తున్న వ్యక్తి తన సొంత జేబుల్లోకి మళ్లించుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కేవలం వేతనాలు దోచుకోవడానికే కొందరు కార్మికులను నియమించుకున్నట్టు ఆరోపణలున్నాయి. ఆ కార్మికుల పేరుతో నెలకు సుమారు రూ.1.50 లక్షలు దోచుకుంటున్నారని తెలుస్తోంది. మూడేళ్లుగా వేతనాల పేరుతో కోట్లాది రూపాయలు సొంత జేబులో వేసుకుంటున్నా.. జీవీఎంసీ అధికారులు స్పందించకపోవడం గమనార్హం.

జీవీఎంసీ పరిధిలో జనాభా పరంగా 22వ వార్డు పెద్దది. ఇక్కడ పరిశుభ్రతకు పని చేసే పారిశుధ్య సిబ్బంది జీవీఎంసీ లెక్కల ప్రకారం 47 మంది. వాస్తవానికి పని చేసేది మాత్రం 15 నుంచి 20 మందే. వీరిలో ముగ్గురు పర్మినెంట్ సిబ్బంది. 44 మంది కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు. ప్రతి రోజూ 47 మంది వార్డు క్లీనింగ్ పనుల్లో హాజరు కావాలి. ఉదయం 5 నుంచి 11 గంటలు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వీధుల్లో చెత్త ఎత్తడం, రోడ్డులు ఊడ్చడం వంటి పనులు చేయాలి. అయితే ఈ పనులకు రోజు 20 మందిలోపే హాజరవుతున్నారు. అయితే, మిగతా సగం మంది కూడా పనులకు వస్తున్నట్టు ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ హాజరు వేసి చెరి సగం వేతనాలు సర్దుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సచివాలయ కార్యదర్శి, సూపర్‌వైజర్ బంధువులు నలుగుర్ని కాంట్రాక్ట్ కార్మికుల కింద నియమించుకున్నట్టు సమాచారం. అంతేకాకుండా బ్లీచింగ్ ఫౌడర్ బస్తాలు సైతం అమ్మేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. కొద్ది నెలల నుంచి మురుగు ప్రాంతాలు, కాల్వాల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లకపోవడమే ఇందుకు నిదర్శనమని పలువురు అంటున్నారు.

బదిలీ అయిన కార్యదర్శే.. ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్

గ్రేటర్ విశాఖ 22వ వార్డుకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేరు. మూడేళ్లుగా సచివాలయ కార్యదర్శి శ్రీనివాస్‌ను ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. కాగా, రెండు నెలల కిందట జరిగిన సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో శ్రీనివాస్‌కు మధురవాడకు బదిలీ జరిగింది. అయినప్పటికీ అతడికే ఇక్కడ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్‌గా కొనసాగిస్తున్నారు. ఉదయం పారిశుధ్య కార్మికులకు హాజరు వేసి మధురవాడ వెళ్లిపోతారు. మధ్యాహ్నం 2 గంటలకు మళ్లీ కళాభారతి పార్కులో కార్మికులకు హాజరు వేయడానికి వస్తారు. దీనివల్ల అటు మధురవాడ, ఇటు 22వ వార్డులో పూర్తిస్థాయిలో శ్రీనివాస్ పనిచేయలేకపోతున్నారు. ఫలితంగా.. 22వ వార్డులో అపరిశుభ్రత తాండవిస్తోందని వార్డు ప్రజలు అంటున్నారు. పూర్తిస్థాయి శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేనందున ఎక్కడి చెత్త కుప్పలే అక్కడే ఉంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్య విభాగంపై పనితీరుపై దృష్టి సారిస్తే.. పారిశుధ్య కార్మికుల వేతనాల పేరుతో దోపిడీ అవుతున్న ప్రజాధనాన్ని అరికట్టవచ్చని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

కిటకిటలాడిన ముడుపుల వెంకన్నస్వామి ఆలయం



దర్శనానికి బారులు తీరిన భక్తులు, (ఇన్‌సెట్‌లో) అలంకరణలో స్వామివారు

వెంకోజీపాలెం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెం కోదండరామాలయంలో వేంచేసియున్న ముడుపుల వెంకటేశ్వరస్వామి ఆలయం గురువారం భక్తులతో కిటకిటలాడింది. పరిసర ప్రాంతాల నుంచే కాకుండా దూర ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి స్వామివారికి ముడుపులను కట్టారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణమే కాకుండా వీధి, సర్వీసు కూడా భక్తులు బారులు తీరారు. స్వామి వారికి ముడుపులను సమర్పించేందుకు వచ్చిన భక్తులు వెంకన్నకు పూజలు నిర్వహించి, అనంతరం ముడుపులను స్వామి వారి ఎదుట ఉంచారు. ఇలా ఉంచిన ముడుపులతో ఏడు శనివారాలు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, స్వామి వారికి కానుకలతో పాటు ముడుపులను హుండీల్లో వేయనున్నారు.గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు ఆడారి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పీల ప్రేమ్‌కిరణ్ జగదీష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే థామస్ క్షమాపణలు చెప్పాలి : ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

మద్దిలపాలెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ మహిళా కృపాలక్ష్మిను అత్యంత నీచంగా దూషించిన ఎమ్మెల్యే థామస్ వెంటనే ఆమెకు క్షమాపణలు చెప్పాలని ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి డిమాండ్ చేశారు. మద్దిలపాలెం వైసీపీ కార్యాలయంలో గురువారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే థామస్ వ్యాఖ్యాలను ఖండించారు. పదహారు నెలల కాలంలో కూటమి ప్రతినిధులు వైసీపీ మహిళా నేతలే టార్గెట్‌గా దూషిస్తున్నారన్నారు. కల్తీ మద్యంపై ఉద్యమం చేస్తున్న కృపాలక్ష్మీపై నీచంగా మాట్లాడడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కలుగజేసుకుని మహిళలపై దాడులు చేస్తున్న ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీఎమ్మార్‌ఎఫ్ మంజూరు పత్రాల పంపిణీ

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : తీవ్ర అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ మంజూరయ్యింది. ఈ మేరకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు లబ్ధిదారులకు గురువారం చెక్కులు అందించారు. పెదజాలారిపేటకు చెందిన రామోలు పరసకు రూ 32,100లు, అదే ప్రాంతానికి చెందిన కసరప హేమలతకు రూ.32,500లు అందించారు.

సినిమా గైడ్

- **కానిస్టేబుల్** : జగదాంబ, రమాదేవి,
- **బల్టీ** : గోకుల్
- **కాంతార 2** : మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ -2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజి** : శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, , లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1, 2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: జగదాంబ, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఇడ్లీ కొట్టు** : శ్రీ వెంకటేశ్వర, రమాదేవి

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 25, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 34, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 30, బీరకాయలు 34, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 20, క్యారెట్ 58, దొండకాయలు 30, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 68, అల్లం (పాతది) 70, బరబాటి 40, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 60, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 56, కీరదోస 28, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 36, కంద 36, దేముడు చిక్కుడు 84, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 22, మామిడి అల్లం 90, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

ప్రత్యేక లక్ష్యంతో యువత ముందడుగు వేయాలి

- కలెక్టర్ హరింధిరప్రసాద్



యువజనోత్సవాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్

మద్దిలపాలెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక లక్ష్యాలను నిర్ణయించుకుని యువత ముందుకు సాగాలని, అప్పుడే ఏదైనా సాధించగలరని జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ పేర్కొన్నారు. మద్దిలపాలెం డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఆయన యువజనోత్సవాలు ప్రారంభించి మాట్లాడారు. నీతి నిజాయితీతో మెలిగి సమాజానికి భారంగా కాకుండా ఉండాలని హితవు పలికారు. జీవితంలో ఎదిగేందుకు నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. చదువుతో పాటు కళలు నేర్చుకోవడంలోనూ దృష్టి పెట్టాలన్నారు. తాత్కాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలు పెట్టుకుని సింగల్ పాయింట్ నినాదంతో పని చేయాలన్నారు. పత్రికలు, పుస్తకాలు చదివి విజ్ఞానం పెంచుకోవాలన్నారు. సాంకేతిక అందిపుచ్చుకొని మంచికి ఉపయోగించాలన్నారు.

అనంతరం నిర్వహించిన వివిధ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభ చాటుకున్నారు. కార్యక్రమంలో సెట్విస్ సీఈవో కవిత, యూత్ అధికారి మహేశ్వర రావు, కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు రాయితీపై బోటు ఇంజన్లు పంపిణీ



పెదజాలరిపేటలో మత్స్యకారులకు బోటు ఇంజన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

పెదవాల్తేరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం కింద మంజూరు చేసిన బోటు ఇంజన్లను పెదజాలారిపేటలోని మత్స్యకారులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మత్స్యకార శాఖ జేడీ లక్ష్మణరావు, ఎఫ్‌డీవో ఆశాజ్యోతి అందజేశారు. గురువారం పెదజాలారిపేట ప్రజా ఆరోగ్య కేంద్రం వద్ద మత్స్యశాఖ అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 39 బోటు ఇంజన్లను అందజేశా రు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ ఒక్కో మోటా రు రూ.83,300 కాగా, ప్రభుత్వం రాయితీపై రూ.33,320కు అందజేసినట్టు తెలిపారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద విశాఖపట్నం తూర్పు నియోజక వర్గంలోని నేటికి 128 మోటార్లు, ఇంజన్లు, బోట్లు, వలలు అందజేసినట్టు వెల్లడించారు. ఇవి అవసరమైన మత్స్యకారులు మత్స్యశాఖకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బైరెడ్డి పోతన్నరెడ్డి, గ్రామ పెద్దలు తెడ్డు పరసన్న, నూకన్న టీడీపీ నాయకులు తెడ్డు రాజు, బాపిరాజు, పెదజాలారిపేట గ్రామ ప్రజలు మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ ఫెయిర్ పోస్టర్ ఆవిష్కరణ



జాబ్ ఫెయిర్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేయ వెలగపూడి, తదితరులు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 23న మద్దిలపాలెం కృష్ణా డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న జాబ్ ఫెయిర్ పోస్టర్‌ను స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణ బాబు గురువారం ఆవిష్కరించారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి చాముండేశ్వరరావు, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి రమేశ్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్న కార్యక్రమంలో అధికారులు జాబ్ ఫెయిర్‌కు సంబంధించిన అంశాలను ఎమ్మెల్యేకు వివరించారు. దివీస్ లాబొరేటరీస్ లిమిటెడ్, డబ్ల్యుఎన్ఎస్, బీ డేటా టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్, ఎలెవెన్ ఎనర్జీ, కాగ్నిజెంట్ ఈ సర్వీసెస్ లిమిటెడ్, లక్ష్మీ హ్యుండయ్, డెక్కన్ ఫైన్ కెమికల్ ఇండియా, టాటా ఎలక్ట్రానిక్స్ (ఐ ఫోన్ మాన్యుఫ్యాక్చరింగ్), క్వెస్ కార్ప్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ, ఇన్నోవ్‌సోర్స్, వీల్స్‌మార్ట్ వంటి సంస్థలు ఇందులో పాల్గొంటున్నట్టు వివరించారు. యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే వెలగపూడి కోరారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే వెలగపూడి
- సఖీ సురక్షలో 502 మందికి వైద్య పరీక్షలు



సవేరా ఫంక్షన్ హాలులో సఖీ సురక్షకు భారీ సంఖ్యలో వైద్య పరీక్షలకు హాజరైన మహిళలు

మద్దిలపాలెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మహిళా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. శివాజీపాలెం సవేరా ఫంక్షన్ హాలులో గురువారం మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన సఖీ సురక్ష హెల్త్ కేర్ స్క్రీనింగ్ వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్త్రీశక్తి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన ప్రభుత్వం, ఇప్పుడు వారి ఆరోగ్యం కోసం సఖీ సురక్ష హెల్త్ కేర్ స్క్రీనింగ్ కింద 16 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తోందన్నారు. డ్వాక్రా మహిళలే కాకుండా మహిళలందరూ వైద్య శిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

జీవీఎంసీ యూసీడీ ఏపీడీ రాము మాట్లాడుతూ మహిళలకు రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్, కొలెస్ట్రాల్, గుండె సంబంధిత పరీక్షలు, రక్తహీనత, విటమిన్, పోషకాహార లోపాలు, మూడు రకాల క్యాన్సర్లు, మానసిక ఆరోగ్యానికి సంబంధించి నాలుగు రకాలు ఇలా 16 రకాల వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. తొలి రోజు వైద్య శిబిరంలో 502 మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ, నేతలు కోడిబోయిన ఆనంద్, ఒమ్మి అప్పారావు, మళ్ల రవికుమార్, సీవోలు, ఆర్పీలు పాల్గొన్నారు.

టెన్త్‌లో శత శాతం ఉత్తీర్ణత కోసం మేలుకొలుపు



విద్యార్థుల ఇళ్ల వద్దకు బయలుదేరుతున్న హెచ్‌ఎం సుమతీబాయి, టీచర్లు

పెదవాల్తేరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషి చేస్తామని కేడీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.సుమతీబాయి పేర్కొన్నారు. విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు 2025-26 విద్యాసంవత్సంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరూ శతశాతం ఉత్తీర్ణతను సాధించడమే లక్ష్యంగా మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా గురువారం ఈస్టు పాయింట్ కాలనీలోని కేడీపీఎం హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు, ఎంఈవో, ఇతర విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు అందరూ కలిసి పాఠశాల పరిధిలో ఉన్న పెదజాలారిపేట, పెదవాల్తేరు, చినవాల్తేరు తదితర గ్రామాలకు వెళ్లి పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి, వారి తల్లిదండ్రులను కలిసి వారి పరీక్షల పట్ల అవగాహన కల్పించారు. రాబోయే నాలుగు, ఐదు నెలల్లో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు తీసుకోవలసిన శ్రద్ధాసక్తులు, జాగ్రత్తలను వివరించారు. విద్యార్థి ఎఫ్ఏ 1, ఎఫ్ఏ 2 పరీక్షలలో వచ్చిన మార్కులను ఎస్సెస్‌మెంటు బుక్కులను చూపిస్తూ విద్యార్థి విద్యాప్రమాణాలు పెంపొందించేందుకు తీసుకోవాల్సిన సూచనలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యారాలు ఎం.సుమతీబాయి, జె.కిరణ్ కుమార్, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీకి రూ.48.21 లక్షలు జమ చేశాం

- కాంక్రీట్ గోడ కూల్చివేతకు అయిన ఖర్చు చెల్లించాం
- హైకోర్టుకు నివేదించిన నేహారెడ్డి, అవ్యాన్ రియల్టర్స్
- తదుపరి విచారణ వాయిదా

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా భీమునిపట్నం పరిధిలో సీఆర్‌జడ్ నిబంధనలకు విరుద్ధంగా సముద్రానికి అతి సమీపంలో నిర్మించిన కాంక్రీట్ గోడను కూల్చేందుకు అయిన రూ.48.21 లక్షల ఖర్చును జీవీఎంసీ వద్ద జమ చేశామని వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి, ఆమె కంపెనీ అవ్యాన్ రియల్టర్స్ ఎల్ఎల్‌పీ గురువారం హైకోర్టుకు నివేదించారు. అందుకు సంబంధించిన వివరాలను ధర్మాసనం ముందు ఉంచారు. ఈ వివరాలు నమోదు చేసిన ధర్మాసనం.. కాంక్రీట్ నిర్మాణంతో ప్రకృతికి నష్టం చేసినందుకు కంపెనీ నుంచి రూ.17.46 కోట్ల నష్ట పరిహారం రాబట్టాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ నేతృత్వంలోని కమిటీ ఇచ్చిన నివేదికపై స్పందన తెలపాలని అవ్యాన్ రియల్టర్స్ ఎల్ఎల్‌పీని ఆదేశించింది. గోడ కూల్చివేతకు అయిన ఖర్చును చెల్లించిన నేపథ్యంలో, కూల్చివేయకుండా మిగిలి ఉన్న గోడను కూడా తొలగించాలని జీవీఎంసీని ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. భీమునిపట్నం పరిధిలోని సీఆర్‌జడ్-1 ప్రాంతంలో సముద్రానికి అతి సమీపంలో నేహారెడ్డి, ఆమె కంపెనీ అవ్యాన్ రియల్టర్స్ ఎల్ఎల్‌పీ శాశ్వత కాంక్రీట్ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని పేర్కొంటూ జనసేన కార్పొరేటర్ పీఎల్‌వీఎన్ మూర్తి యాదవ్ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. సీఆర్‌జడ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన నాలుగు రెస్టోబార్లను తొలగించడంతో పాటు సహజ ఆవాసాలను పునరుద్ధరించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా కాంక్రీట్ గోడను కూల్చేందుకు అయిన ఖర్చును జీవీఎంసీ వద్ద జమ చేయాలని నేహారెడ్డి, అవ్యాన్ రియల్టర్స్ ఎల్ఎల్‌పీని ధర్మాసనం ఆదేశించిన విషయం తెలిసిందే.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు ముఖ్యం

- జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్



సదస్సులో పాల్గొన్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, పాల్గొన్న అసోసియేషన్ ప్రతినిధులు

బీచ్ రోడ్డు, అక్టోబర్ 16, (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల్లో తప్పకుండా భద్రతా ప్రమాణాలను పాటించాలని జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ స్పష్టం చేశారు. గురువారం కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఫర్టిలైజర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని పామ్ బీచ్ హోటల్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాపు గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాలని సూచించారు. పరిశ్రమల్లో భద్రతను పర్యవేక్షించేందుకు ఒక ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలోని పరిశ్రమల్లో సురక్షిత వాతావరణాన్ని కల్పించడమే ఈ ప్రత్యేక డ్రైవ్ లక్ష్యమని అన్నారు. కంపెనీలు రోజువారి కార్యకలాపాల్లో రిస్క్ మేనేజ్‌మెంట్‌ను ఒక అంతర్భాగంగా చేసుకోవాలన్నారు. విత్తన పరిశ్రమ భద్రతా సంస్కృతికి కట్టుబడి ఉందన్నారు. విత్తనశుద్ధి, ఉత్పత్తి, పంపిణీపై పని చేసే కార్మికులు అత్యున్నత భద్రతా ప్రమాణాలకు కట్టుబడి ఉన్నామన్నారు. ఎఫ్ఏఐ డైరెక్టర్ జనరల్ ఎస్కే చౌదరి మాట్లాడుతూ ఎరువుల తయారీ రంగంలో భద్రతా సంస్కృతిని పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. ప్రమాదకర పరిస్థితుల్లో రిస్క్ నిర్వహణ చట్టాలను బలోపేతం చేయడంలో ఇటువంటి వర్క్‌షాప్‌లుఎంతో దోహదపడతాయన్నారు. రియల్ టైం కండిషన్ పర్యవేక్షణ కోసం ఐవోటీ ఆధారిత సెన్సార్ల వంటి ఆధునిక ఆవిష్కరణలను ఉపయోగించుకోవాలని, భద్రతా ప్రోటోకాల్‌ను చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫర్టిలైజర్ బిజినెస్ సీనియర్ హెడ్ జ్ఞాన సుందరం, కెఎఫ్ఎల్ ఎం.డి. ఏకే చోప్రా, విశాఖపట్నం కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ యూనిట్ హెడ్ సీహెచ్ ఈశ్వరరావు, జనరల్ మేనేజర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల అప్రమత్తత అవసరం

- నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి



ర్యాలీలో పాల్గొన్న సీపీ శంఖబ్రత బాగ్చి, ఏఎంసీ ప్రిన్సిపాల్ సంధ్యాదేవి, పలువురు మెడికల్ ప్రొఫెసర్లు

బీచ్ రోడ్డు, అక్టోబర్ 16, (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. అంతర్జాతీయ అనస్థీషియా దినోత్సవం సందర్భంగా గురువారం ఆర్కే బీచ్ వద్ద విశాఖపట్నం అనస్థీషియా సొసైటీ, ఆంధ్రా మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో అనస్థీషియా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రోగులను చికిత్స అందించడంలో అనస్థీషియాలజిస్టులు పాత్ర కీలకమన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి మాట్లాడుతూ 1846లో డాక్టర్ విలియమ్ టీజీ మోర్టన్ విజయవంతంగా ఎథర్ ఎనస్థీషియా ప్రదర్శించిన చారిత్రాత్మక ఘట్టానికి గుర్తుగా ఈరోజు స్మరించుకోవాల్సి ఉందన్నారు.శస్త్రచికిత్స, ఆరోగ్య సంరక్షణలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. అనంతరం ఆర్కే బీచ్ కాళికా మాత దేవాలయం నుంచి వైఎంసీఏ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సంధ్యాదేవి, ప్రొఫెసర్ వీఎస్ఎన్ మూర్తి, ప్రొఫెసర్ నవీన్, ప్రొఫెసర్ డాక్టర్ రెడ్డి కుమార్, డాక్టర్లు కె.అపరంజి, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

వాయు కాలుష్య నివారణకు విద్యార్థినుల ప్రతిజ్ఞ



స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : వాయు కాలుష్యాన్ని నివారిద్దామంటూ విద్యార్థినులు నినాదాలు చేశారు. ఎంవీపీ కాలనీలోని అళ్వార్‌దాస్ డిగ్రీ కళాశాలలో గురువారం గ్రీన్ క్లైమేట్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహించిన స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో విద్యార్థినులు పాల్గొన్నారు. బాల్య వివాహాలను నివారిద్దామని ప్రతిజ్ఞ చేశారు. వస్త్ర సంచులను విద్యార్థులు, కళాశాల అధ్యాపకులకు పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్, గ్రీన్ క్లైమేట్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

16వ వార్డులో గోతులు పూడ్చరూ..

వెంకోజీపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 15, 16 వార్డుల్లోని ప్రధాన మార్గాల్లో రోడ్లు గోతులమయంగా మారిన నేపథ్యంలో 15వ వార్డులోని హెచ్‌బీ కాలనీ జంక్షన్‌లో ఏర్పడిన గొయ్యిని పూడ్చారు. అయితే 16వ వార్డులోని హెచ్‌బీ కాలనీ నుంచి కృష్ణా కళాశాల రోడ్డులో ఏర్పడిన గోతులను మాత్రం అలానే ఉంచేశారు. దీంతో ట్రాఫిక్‌ను అధిగమించేందుకు ఆటోమోటివ్ జంక్షన్ నుంచి హెచ్‌బీకాలనీ మీదుగా కొత్త వెంకోజీపాలెం హైవే పైకి చేరుకునే వాహనచోదకుల కష్టాలు తీరలేదు. ఈ మార్గంలోని రోడ్లపై కూడా సంబంధిత అధికారులు గోతులను పూడ్చే చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

26వ వార్డులో చకచకా రోడ్డు పనులు



రోడ్డు పనులను పరిశీలిస్తున్న టీడీపీ వార్డు అధ్యక్షుడు కిశోర్‌కుమార్, ఏఈ లావణ్య

అక్కయ్యపాలెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలో బీటీ రోడ్ల పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఈ పనులను టీడీపీ వార్డు అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్ గురువారం పరిశీలించారు. రూ.45 లక్షలతో ఈ పనులు చేపడుతున్నట్టు ఆయన తెలపారు. ఇండియన్ పెట్రోల్ బంక్ లైన్, ప్రజారోగ్య కేంద్రం పక్క లైన్‌లో ఈ రోడ్ల పనులు చేపట్టారు. ఆయనతో పాటు ఏఈ లావణ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

టెన్త్‌లో మెరుగైన ఫలితాల కోసం మేలుకొలుపు

» విద్యార్థుల ఇళ్లకు వెళ్లి చదువు తీరును పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు » తల్లిదండ్రులతో మాట్లాడి పలు సూచనలు, సలహాలు అందజేత



అక్కయ్యపాలెం : విద్యార్థిని ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు సూచనలిచ్చి బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎంఈవో రామారావు, హెచ్‌ఎం శాంతికుమారి

అక్కయ్యపాలెం, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత లక్ష్యంతో యాక్షన్ ప్లాన్‌లో భాగంగా గురువారం సాయంత్రం గ్రామ, వార్డు సందర్శన కార్యక్రమాన్ని రైల్వే న్యూకాలనీలోని కేఎస్‌ఎం బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శాంతికుమారి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్ళకు వెళ్ళి పరిశీలించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీతమ్మధార మండల ఎంఈవో డి.రామారావు హాజరయ్యారు. విద్యార్థులు ఇంటి వద్ద ఎలా చదువుతున్నారని తెలుసుకోవడంతో పాటు తల్లిదండ్రులతో ఎఫ్‌ఏ1, ఎఫ్‌ఏ-2 పరీక్షల్లో వారి ప్రగతిని చర్చించారు. అలాగే వారు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా, ఇంటి దగ్గర ఉన్నప్పుడు టీవీ, సెల్ ఫోన్లను ఎక్కువ సేపు చూడకుండా చూసుకోవాలని, తద్వారా పాస్ అయ్యేందుకు తగు చర్యలు తీసుకొని సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్పీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రేటర్ విశాఖ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో గ్రామ, వార్డు సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించి పరిసర ప్రాంతాల విద్యార్థుల ఇళ్ళకు వెళ్ళి వారి తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లల చదువుకు తీసుకోవాల్సిన సూచనలు, సలహాలను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యామల, అప్పారావు, గ్లోరి, పీడీ రత్నం, సీఆర్పీ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెంలో..

కంచరపాలెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఉత్తీర్ణత శాతం సాధించేలా ప్రభుత్వం అమలు చేస్తున్న మేలుకొలుపు కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. జీవీఎంసీ ఆర్పీపేట ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుచున్న విద్యార్థుల ఇళ్లకు హెచ్‌ఎం .ఎం.రాజ్యలక్ష్మీతో పాటు పలువురు ఉపాధ్యాయులు గురువారం వెళ్లి విద్యార్థులు చదువుచున్న తీరును అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు ఏ విధంగా సన్నద్ధం కావాలో వివరించారు. ఇటీవల జరిగిన ఫార్మేటివ్ పరీక్షలో వచ్చిన మార్కులను తెలుసుకొని, తప్పొప్పులను వివరించారు. రానున్న మూడు నెలల కాలం చాలా విలువైనదని, చక్కగా ప్రణాళికతో చదవాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను జాగ్రత్తగా గమనిస్తుండాలని, వారికి చదువుకు అనుకూల వాతావరణం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు కె.నాగేశ్వర్రావు, ఎస్వీ రమణ, చుక్‌బాబు, అర్జున్, వసంతకుమారి, సీఆర్పీ చైతన్య పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణపై ఎల్‌ఈడీ ప్రదర్శన

మురళీనగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో ట్రాఫిక్, నేరాల నియంత్రణకు పోలీసు శాఖ అధికారులు, సిబ్బంది ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో గురువారం కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో బర్మా క్యాంప్ ఏఎస్‌ఆర్ నగర్ జంక్షన్‌లో ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ప్రజలకు పోలీసులు జాగ్రత్తలు తెలియజేశారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేకించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలను స్క్రీన్‌పై చూపిస్తూ అవగాహన కల్పించారు.

బాణసంచా దుకాణదారులు నిబంధనలు పాటించాలి

... 5వ పేజీ తరువాయి

తప్పవన్నారు. వ్యాపారి లైసెన్స్ కోసం దరఖాస్తు చేస్తున్నప్పుడే ఏ ప్రాంతంలో ఏర్పాటుచేస్తున్నారు, షెడ్ మ్యాప్, ఇత్యాది వివరాలు సమర్పించాలన్నారు. జీవీఎంసీ, అగ్నిమాపక శాఖ, విద్యుత్ శాఖల నుంచి ఎన్‌ఓసీ తప్పనిసరి అని, దుకాణం ఏర్పాటుచేసే వ్యక్తికి 18 ఏళ్లు నిండి ఉండడంతోపాటు జీఎస్టీ సర్టిఫికెట్ కలిగివుండాల న్నారు. దుకాణాలు నర్సింగ్‌హోమ్‌లు, ఆరోగ్య కేంద్రాలు, విద్యాసంస్థలు, మతపరమైన ప్రదేశాలకు కనీసం వంద మీటర్లు అవతల ఉండాలన్నారు. ప్రతిదుకాణం వద్ద తగినంత ఇసుక బకెట్లు, నీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. దీపావళి రోజున రాత్రి ఎనిమిది నుంచి పది గంటల వరకు మాత్రమే బాణసంచా కాల్చేందుకు అనుమతిస్తామన్నారు. బాణసంచా అక్రమ నిల్వ, విక్రయాలకు సంబంధించి ప్రజలు డయల్ 100 లేదంటే 7995095799 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సీపీ కోరారు.

సచివాలయాలపై దృష్టి

... 5వ పేజీ తరువాయి

రూపొందించింది. ఉమ్మడి జిల్లాలోని 39 మండలాల్లో 39 మంది డిప్యూటీ ఎంపీడీవోలను నియమించనున్నారు. ప్రస్తుతం అంతమంది డిప్యూటీ ఎంపీడీవోలు లేనందున పంచాయతీరాజ్ శాఖలో సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించనున్నారు. దీనికి సంబంధించి సుమారు 50 మందితో సీనియారిటీ జాబితాను పంచాయతీరాజ్ శాఖ అధికారులు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపారు. ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకున్న తరువాత అర్హులకు పదోన్నతులు ఇవ్వనున్నారు. గ్రామ సచివాలయాల పర్యవేక్షణ బాధ్యతను ఒక అధికారికి అప్పగించాలన్న పంచాయతీరాజ్ శాఖ నిర్ణయాన్ని ఉద్యోగులు స్వాగతిస్తున్నారు. ప్రస్తుతం సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను ఆయా శాఖల అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇక నుంచి ఆయా శాఖల అధికారుల అజమాయిషీ ఉన్నప్పటికీ ప్రత్యేకించి డిప్యూటీ ఎంపీడీవో స్థాయి అధికారిని నియమిస్తే పాలన గాడిలో పడుతుందని ఉద్యోగులు అంటున్నారు. కేవలం ఒక అధికారిని నియమించి వదిలేయకుండా ఆయన పరిధిలో సిబ్బందిని నియమించి జాబ్‌చార్టు రూపొందిస్తే ఫలితం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

షీలానగర్-సబ్బవరం హైవేకు పచ్చజెండా

... 5వ పేజీ తరువాయి

మంజూరయ్యాయి. షీలానగర్ నుంచి సబ్బవరం వరకూ ఆరు వరుసల్లో రహదారిని నిర్మించి అక్కడ జాతీయ రహదారికి అనుసంధానం చేస్తారు. అయితే ఈ పనులు ఇప్పటికే మొదలయ్యాయి. మరోవైపు షీలానగర్ నుంచి విశాఖపట్నం పోర్టు కనెక్టివిటీ కోసం నేషనల్ హైవే అథారిటీ ఇప్పటికే పనులు నిర్వహిస్తోంది. కాన్వెంట్ జంక్షన్ నుంచి ఆరు వరుసల మార్గాన్ని రూ.679 కోట్లతో చేపట్టింది. సరకు రవాణా వాహనాలు ఇకపై గాజువాక హైవే పైనుంచి నగరంలోకి రాకుండా, సబ్బవరం వద్ద కనెక్ట్ అయ్యే ఆరు వరుసల మార్గంలో షీలానగర్ వరకు వచ్చి, అక్కడి నుంచి విమానాశ్రయం పక్క మార్గంలో కాన్వెంట్ జంక్షన్ మీదుగా పోర్టుకు చేరుకుంటాయి. దీనివల్ల నగర ట్రాఫిక్‌పై ఒత్తిడి తగ్గుతుంది. ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గనుంది. సరకు రవాణా వాహనాలు 24/7 నడుపుకొనే వీలుంటుంది. ఇప్పటిలా ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు నగరంలోకి రాకుండా ట్రాఫిక్ ఆంక్షలు ఏమీ ఉండవు.

రైల్వే లైన్లు జాతికి అంకితం

విశాఖపట్నం నుంచి పొరుగు జిల్లాలకు కనెక్టివిటీ పెంచేందుకు రైళ్ల రద్దీని తట్టుకునేందుకు వీలుగా కొత్తవలస-విజయనగరం మధ్య నాలుగో లైన్ నిర్మాణానికి ప్రధాని శంకుస్థాపన చేశారు. దాంతో పాటు పెందుర్తి-నార్త్ సింహాచలం మధ్య రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేశారు. కొత్తవలస-కిరండూల్ మార్గంలో కొత్తవలస-బొడ్డవర, సిమిలిగుడ-గోరాపూర్ సెక్షన్ల మధ్య ఇప్పటికే డబ్లింగ్ పనులు పూర్తవ్వడంతో జాతికి అంకితం చేశారు. వీటి వల్ల ప్రయాణికులు, పర్యాటకుల కోసం అదనపు రైళ్లు నడిపే అవకాశం ఉంది. సరకు రవాణా కూడా సులభతరం కావడంతో పాటు వేగవంతం అవుతుంది.

వుడా కాలనీలో రహదారుల పక్కన బడ్డీల తొలగింపు



బడ్డీలు తొలగిస్తున్న దృశ్యం

మురళీనగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : 'ఆపరేషన్స్ లంగ్స్' పేరిట రహదారుల పక్కన ఉన్న దుకాణాలను ఇటీవల తొలగించగా, వ్యాపారులు తిరిగి యథాస్థానంలో ఏర్పాటు చేస్తుండడంపై అధికారులు స్పందించారు. ఈ విషయమై 'బడ్డీల ఆక్రమణ కథ మళ్లీ మొదటికి" శీర్షికన ఈనెల 14న మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి మరోమారు మురళీనగర్, మాధవధార వుడా కాలనీల్లో రహదారులకు ఇరువైపులా వెలసిన దుకాణాలను తొలగించారు. మాధవధార వుడా కాలనీ మూడు రోడ్ల జంక్షన్ రహదారి ఫ్రీలెఫ్ట్‌లో కంటైనర్ దుకాణాల్ని, ఉడా కమ్యూనిటీ హాలు ప్రహరీని ఆనుకొని ఏర్పాటైన బడ్డీల్ని క్రేన్ సాయంతో తొలగించి రోడ్డు మార్గాల్ని పునరుద్ధరించారు. జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్మూలన పనుల తర్వాత పబ్లిక్ హెల్త్ శానిటేషన్ విభాగం సిబ్బంది బడ్డీలు ఏర్పాటైన ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. కోట్ల రూపాయలతో ఆధునీకరించిన మాధవధార, కైలాసపురం, సీతమ్మధార ప్రాంతాల 48ఏ బస్ రూట్ ప్రధాన రహదారి పూర్వపు రూపు సంతరించుకుంది. బస్టాపులు, కల్యాణ మండపాలు, ప్రధాన జంక్షన్లలో వరుసగా తొలగింపుల తర్వాత తిరిగి వెలసిన బడ్డీలను అధికారులు మళ్లీ తొలగించడంతో స్పష్టమైనఆదేశాలు ఇచ్చారు. బడ్డీల యజమానులు స్థానిక రాజకీయ నాయకులు, కాలనీ పెద్దలమంటూ వచ్చిన ఒత్తిళ్లను కూడా పక్కనబెట్టి రహదారులకు కొత్త ఊపిరి పోశారు. విశాఖను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడానికి కలసికట్టుగా పని చేస్తున్న అధికారుల తీరు పట్ల స్థానికులు, వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కూలి ధరలు పెంచాలి

» ప్లైవుడ్ దుకాణ కార్మికుల నిరసన



నిరసన తెలియజేస్తున్న కార్మికులు

అక్కయ్యపాలెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : వివిధ ప్రాంతాల్లోని ప్లైవుడ్ షాపుల్లో లోడింగ్, అన్ లోడింగ్ ముఠా కార్మికుల కూలి ధరలు పెంచేలా చర్యలు తీసుకోవాలని విశాఖ జిల్లా ముఠా వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు కార్మిక శాఖ కమిషనర్ ఉప కమిషనర్‌ను కోరారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలోని కార్మిక శాఖ కార్యాలయం ఎదుట గురువారం ముఠా కార్మికులు నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ప్లైవుడ్ కార్మికుల కూలి ధరలు పెంచడంలో షాపుల యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కూలి ధరల ఒప్పందం జరిగి నాలుగేళ్లు దాటినా కొత్త కూలి ధరల ఒప్పందం చేయడానికి యాజమాన్యాలు ఎటువంటి చర్య తీసుకోకుండా తీవ్ర కాలయాపన చేస్తున్నారన్నారు. దీనివల్ల ముఠా కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కార్మికశాఖ కార్యాలయానికి ఫిర్యాదు చేసి నెల రోజులు దాటినా ఇప్పటి వరకూ యాజమాన్యాలపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సీహెచ్ చిన్నారావు, బి.వెంకటరావు, చంటి, కె.సత్తిబాబు, పి.రాము తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ వాలీబాల్, బాస్కెట్‌బాల్ విజేత కర్ణాటక



బహుమతి ప్రదానం చేస్తున్న అమరదీప్ మిశ్రా

విశాఖపట్నం, స్పోర్ట్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఈపీఎఫ్‌వో సౌత్‌జోన్ బాస్కెట్‌బాల్, వాలీబాల్ టోర్నీల్లో కర్ణాటక విజేతగా నిలిచింది. గీతం యూనివర్సిటీ జరిగిన టోర్నీ ముగింపు కార్యక్రమానికి రీజనల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ గ్రేడ్-1 అమరదీప్ మిశ్రా ముఖ్య అతిథిగా విచ్చేసి విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో గీతం రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖరన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతాలు



సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

సీతంపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 25వ వార్డు రెల్లివీధి అంగన్‌వాడీ కేంద్రంలో 8వ రాష్ట్రీయ అంగన్‌వాడీ పోషణ మాసోత్సవాల సందర్భంగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించి పోషణ కిట్లను గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి గర్భిణులకు సీమంతం నిర్వహించి వారికి పోషణ కిట్లను అందచేశారు. కార్యక్రమంలో డాక్టర్ మన్మోహన్, సచివాలయం కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశా వర్కర్లు, బాలింతలు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

డాబాగార్డెన్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పాత జైల్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు)లో ఎఫ్‌జీఎం (ఫ్యాషన్ అండ్ గార్మెంట్ మేకింగ్) ఒకేషనల్ కోర్సు బోధించడానికి గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ జె. విజయ తెలిపారు. గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంఎస్ టెక్స్ టైల్ అండ్ క్లోతింగ్ ఇన్ హోమ్ సైన్స్ చదివిన వారు అర్హులు అని చెప్పారు. ఆసక్తి గల వారు ఈనెల 22న మద్దిలపాలెంలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఆమె సూచించారు.

పెట్టుబడుదారులకు స్వర్గధామం ఏపీ

మహారాణిపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుదారులకు స్వర్గధామంగా మారిందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ అన్నారు. గురువారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అద్భుతాలు సృష్టిస్తున్నారని, ప్రభుత్వం ఏర్పడిన 16 నెలల్లో ఆరున్నర లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు తీసుకువచ్చారని చెప్పారు. ఆయన చరిష్మా వల్లే ప్రపంచంలో దిగ్గజ కంపెనీలన్నీ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్నాయన్నారు.

సత్రం నిర్మాణానికి స్థలం కేటాయించాలి



అధికారులకు వినతిపత్రం అందిస్తున్న సంఘం నాయకులు

మహారాణిపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానంలో విశ్వ బ్రాహ్మణులకు సత్రం నిర్మాణానికి కొంత స్థలం కేటాయించాలని విశ్వ బ్రాహ్మణ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ గొడి నరసింహాచారి కోరారు. గురువారం ఆయన ఆ సంఘం నాయకులతో కలిసి దేవాదాయ శాఖ ఉప కమిషనర్, సహాయ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింహాచలం కొండపై సత్రం నిర్మించి, భక్తులకు సేవలు అందించనున్నట్టు తెలిపారు స్థలం కేటాయిస్తే విశ్వ బ్రాహ్మణ సంఘం నిధులతో నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శివకోటి శ్రీనివాసరావు, పక్కి కొండబాబు, గిడిజాల పార్వతీశం, రాయల లక్ష్మణరావు, బంగారు సురేశ్, గుత్తి కొండ గంగాధర్, వీరాచారి, వీరభద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు గాజులు పంపిణీ

మహారాణిపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్ బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లక్ష గాజులతో అమ్మవారిని అలంకరించిన విషయం తెలిసిందే. ఆ గాజులను అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు గురువారం పంపిణీ చేశారు. అమ్మవారికి అలంకరించిన గాజులు కావడంతో భక్తులు వాటిని ఆనందంగా స్వీకరించారు.

లభించని వ్యక్తి ఆచూకీ

తగరపువలస, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గోస్తనీ నదిలో స్నానానికి దిగి గల్లంతైన తమ్మిన శ్రీనివాసరావు ఆచూకీ గురువారం కూడా లభించలేదు. రెండు రోజులుగా పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్ల సహకారంతో నదిలో గాలింపు చర్యలు చేపడుతున్నారు.పడవలో ఎనిమిది మంది ఈతగాళ్లు అనుమానం వచ్చిన ప్రాంతాల్లో వెతుకుతున్నారు. నది 30 అడుగుల లోతుగా ఉండడంతో గాలింపు చేపట్టలేకపోతున్నామని ఈతగాళ్లు చెబుతున్నారు.

సూపర్ జీఎస్టీపై అవగాహన ర్యాలీ



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్తగా అమలు చేసిన సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై రవాణా శాఖాధికారులు గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఈ ర్యాలీని కలెక్టరేట్ వద్ద ప్రారంభించారు, ర్యాలీ ఆర్‌కే బీచ్ మీదుగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల వరకు జరిగింది. సుమారు వందకు పైగా వా హనదారులు ర్యాలీలో పాల్గొని, ప్రజలకు సూపర్ జీఎస్టీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖాధికారులు ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ దుష్యంత్ , తదితరులు పాల్గొన్నారు.

నేడు దిశా సమావేశం

మహారాణిపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో శుక్రవారం దిశా సమావేశం జరగనున్నట్టు జిల్లా పరిషత్ సీఈవో, దిశా కన్వీనర్ పి.నారాయణమూర్తి తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9.30 నిమిషాలకు ఎంపీ శ్రీభరత్ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు. సమావేశంలో కేంద్ర ప్రభుత్వ పథకాలు, వాటి మార్గదర్శకాలు, ప్రయోజనాలపై సమీక్ష జరుగుతుందన్నారు. అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఆయన సూచించారు.

24 నుంచి యువజనోత్సవాలు

జ్ఞానాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సెయింట్ జోషఫ్ మహిళా కళాశాలలో ఈనెల 24,25 తేదీల్లో యుజనోత్సవాలు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డా. సిస్టర్ షైజీ తెలిపారు. గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థినుల సహాయార్థం తొమ్మిదేళ్లుగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. నగరంలోని పలు కళాశాలలకు చెందిన సుమారు నాలుగు వేల మంది విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొంటారని చెప్పారు.

ఘనంగా ఎరుకుమాంబ ఉత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

దొండపర్తి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : దొండపర్తిలో ఉన్న ఎరుకుమాంబ అమ్మవారిని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గురువారం దర్శించుకున్నారు. ఆలయం వార్షికోత్సవం పురస్కరించుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో 27, 42 వార్డుల కార్పొరేటర్లు గొలగాని వీరారావు, లీలావతి, టీడీపీ వార్డు అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి, ఆకి రెడ్డి జగదీశ్, ఆలయ ఈవో సురేశ్ బాబా, తదితరులు పాల్గొన్నారు.

34వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కార్యక్రమంలో పాల్గొన్న కూటమి నాయకులు

అల్లిపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 34వ వార్డు పరిధిలోని కొబ్బరితోట, ఈతపేటలో రూ. 26 లక్షలతో చేపట్టనున్నట్టు అభివృద్ధి పనులకు జనసేన వార్డు అధ్యక్షుడు నీలం రాజు ఆధ్వర్యంలో టీడీపీ నాయకుడు వాసుపల్లి రామ్‌కుమార్, కార్పొరేటర్ తోట పద్మావతి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నీలం రాజు మాట్లాడుతూ కొబ్బరితోటలో రూ. 13 లక్షలతో యూజీడీ పనులు, ఈతపేటలో రూ. 13 లక్షలతో పైపులైన్ల నిర్మాణం చేపట్టనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్ బే వద్ద పోకిరీల బెడద

అక్కయ్యపాలెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : అక్కయ్యపాలెం నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న బస్ బే దగ్గర ఆకతాయిల బెడద ఎక్కువైందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీకటి పడితే చాలు ఆకతాయిలు వచ్చి బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులతో కారణం లేకుండా గొడవలు పడుతున్నారు. బస్ బేలో ఉన్నలైట్లు వెలగకపోవడంతోఆ ప్రాంతమంతా చీకటిగా ఉంటోంది. దీంతో ఆకతాయిలు విచ్చలవిడిగా రెచ్చిపోతున్నారని పలువురు ప్రయాణికులు అంటున్నారు. అక్కడే మద్యం సేవించడంతో పాటు ఇదేమిటని ప్రశ్నించిన వారిని నానాదుర్భషలాడి దాడి చేసేందుకు కూడా వెనుకాడడం లేదంటున్నారు. అంతేకాకుండా లైట్లు వెలగక చీకటిగా ఉండడంతో ఎటునుంచి వాహనం వచ్చి ఢీకొడుతుందోనని భయమేస్తోందని, దొంగల భయం కూడా ఉందని ఆందోళన చెందుతున్నారు. కొద్ది రోజుల క్రితం అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలో పట్టపగలే ఓ మహిళ మెడలో గొలుసు తెంపి పారిపోతుంటే స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. దీనిపై పోలీసులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

ఆలయం పైకప్పు మరమ్మతులు పూర్తి



మరమ్మతులు పూర్తయిన పైకప్పు

సింహాచలం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న ఆలయం పైకప్పు మరమ్మతులు పూర్తయ్యాయి. నాలుగు దశాబ్దాలుగా ఆలయం పైకప్పుపై పలుచోట్ల లీకులు ఏర్పడడంతో వర్షం పడితే నీరు లోపలికి చేరేది.దీనివల్ల భక్తులతో పాటు అర్చకులు, అధికారులు ఇబ్బందులు పడేవారు. లీకుల మరమ్మతుకు అధికారులు లక్షలాది రూపాయలు వెచ్చింది శాండ్ బ్లాస్టింగ్ పనులు చేయించినప్పటికీ ఫలితం లేకపోయేది. ఎట్టకేలకు పురావస్తు శాఖ డైరెక్టర్ మునిరత్నం రెడ్డి పర్యవేక్షణలో పూణేకు చెందిన వెంకటేశ్వర ఆధ్యాత్మిక చారిటబుల్ ట్రస్టు రూ. 5 కోట్లు వెచ్చించి నాలుగు నెలలు పాటు శ్రమించి మరమ్మతులు పూర్తి చేశారు. సనాతన భారతీయ విధానంలో కరక్కాయ, బెల్లం, బెండకాయలు, తదితరాలను ఆఫ్రికా నుంచి రప్పించిన ప్రత్యేక మృత్తికలో కలిపి నీటిలో నానబెట్టి జిగురు వంటి కాంక్రీట్‌ను ఆలయం పైకప్పుపై వేశారు. దానిపై ప్రత్యేకమైన టైల్స్ బిగించారు. పనులన్నీ పూర్తయ్యాయి.

అంతర్జాతీయ ఎయిర్ కార్గో లేనట్టే!!

... 5వ పేజీ తరువాయి

పోర్టులు ఉన్నాయి. విశాఖపట్నం స్టీల్ ప్లాంటు ఉంది. మందులు తయారీచేసి విదేశాలకు పంపే ఫార్మా కంపెనీలు వందల సంఖ్యలో ఉన్నాయి. విశాఖపట్నం నుంచి రొయ్యలు, టూనా చేపలు పంపించే సీఫుడ్ ఎక్స్‌పోర్టర్లు ఉన్నాయి. విదేశాలకు రెడీమేడ్ దుస్తులు పంపించే బ్రాండిక్స్ కర్మాగారం ఉంది. ఇలాంటిచోట సరకులు పంపడానికి ప్రత్యేక విమానాశ్రయం నిర్మించాల్సి ఉండగా...ఒక్కరోజు కూడా ఆ ప్రతిపాదన చేయలేదు. ఎగుమతిదారులు సిద్ధంగా ఉన్నా విమానాల్లో పంపడానికి అవకాశం ఇవ్వలేదు. ఇప్పుడు విశాఖ నుంచి 195 కి.మీ. దూరాన ఉన్న పలాసలో ప్రత్యేకంగా కార్గో విమానాశ్రయం నిర్మించాలని ప్రతిపాదించారు. భూ సర్వేకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. భూముల సేకరణకు ఇటీవల ప్రజాభిప్రాయ సేకరణ కూడా నిర్వహించారు. స్థానిక రైతులు వ్యతిరేకించారు. పలాసకు సరైన బస్టాండ్ లేదు గానీ విమానాశ్రయం కడతారా?...అంటూ చాలా మంది ప్రశ్నించారు. పలాసలో కార్గో విమానాశ్రయం వస్తే జీడిపప్పును నేరుగా విదేశాలకు ఎగుమతి చేసుకోవచ్చునని, ఇంకా మరిన్ని కంపెనీలు వస్తాయని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. విస్తృత అవకాశాలున్న విశాఖపట్నాన్ని కాదని పలాసలో పెట్టడంపై పారిశ్రామిక వర్గాలు పెదవి విరుస్తున్నాయి.

మొక్కుబడిగా చెత్త సేకరణ!

... 5వ పేజీ తరువాయి

కిలోలతో కూడా ఎంఎస్ఎఫ్‌లకు వాహనాలు వెళుతున్నాయి. ప్రతి వాహనానికి గతంలో జీపీఎస్‌ను అమర్చారు. దీనివల్ల ఆ వాహనం ఏ ప్రాంతంలో తిరిగింది, ఏ సమయంలో ఎంఎస్ఎఫ్‌కు వెళ్లింది...అనే వివరాలను అధికారులు జీపీఎస్‌తోపాటు ఎంఎస్ఎఫ్‌ల వద్ద ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల ద్వారా గుర్తించేవారు. కానీ ఇప్పుడు వాహనాల జీపీఎస్, ఎంఎస్ఎఫ్‌ల వద్ద ఏర్పాటుచేసిన సీసీకెమెరాలు కూడా పనిచేయడం మానేశాయి. దీంతో క్లాప్ వాహనాలు ఎన్ని ట్రిప్పులు తిరిగాయి, ఎంత బరువు చెత్తను తీసుకువెళ్లాయనే సమాచారం కోసం ఎంఎస్ఎఫ్‌ల వద్ద ఏర్పాటుచేసిన సిబ్బంది చేతిలోని రికార్డుల్లో నమోదుచేసే వివరాలే ఆధారం అవుతున్నాయి. క్లాప్ వాహనాల కాంట్రాక్టర్, డ్రైవర్లు ఆయా పాయింట్లలోని సిబ్బందిని మచ్చికచేసుకుని తమకు అనుకూలంగా వివరాలు నమోదుచేయించుకుంటున్నారు. వారిచ్చిన వివరాలు ఆధారంగా ప్రతినెలా బిల్లు కోసం జీవీఎంసీకి ఫైల్ పెడుతున్నారు.

కాంట్రాక్టర్‌కు డబ్బు.... నగరవాసులకు తిప్పలు

ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి చెత్తసేకరించాల్సిన క్లాప్ వాహనాలు వారంలో మూడు, నాలుగు రోజులు మాత్రమే వస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దీనివల్ల ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను నిల్వ ఉంచుకోలేక రోడ్లపైన, సమీపంలోని గెడ్డల్లోనూ పడేస్తున్నారు. దీనివల్ల పారిశుధ్య సమస్య తలెత్తుతోంది. గెడ్డల్లో చెత్త కారణంగా మురుగునీటి ప్రవాహం నిలిచిపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. మరోవైపు రోడ్డుపక్కన పడేస్తున్న చెత్తను పశువులు, కుక్కలు చిందరవందర చేస్తున్నాయి.

చెత్త సేకరణ సక్రమంగా జరగనప్పటికీ కాంట్రాక్టర్‌కు మాత్రం జీవీఎంసీ ప్రతి నెలా రూ.3.9 కోట్లు బిల్లు చెల్లించాల్సిక తప్పని పరిస్థితి ఉంటోంది. అధికారులు కూడా క్లాప్ వాహనాలు ఎన్నిరోజులు పనిచేయలేదు, ఎన్ని ట్రిప్పులు తిరిగాయనే లెక్కలు వేయకుండా కాంట్రాక్టర్‌కు డబ్బు చెల్లించేస్తున్నారు. గతంతో పోల్చితే ఇటీవల కాలంలో నగరంలో పారిశుధ్యం దిగజారింది. ఈ విషయం గుర్తించే కమిషనర్ కేతన్‌గార్గ్ ఇటీవల క్లాప్ వాహనాల పనితీరుపై దృష్టిసారించారని అధికారులు చెబుతున్నారు. వార్డు శానిటేషన్ సెక్రటరీలు ప్రతిరోజూ ఏదో ఒక క్లాప్ వాహనం వెనుక తిరిగి ఇంటింటికీ చెత్తసేకరణ జరిగేలా చూడాల్సిందేనని ఆదేశాలు జారీచేశారు. అలాగే ప్రజలు చెత్తను క్లాప్ వాహనాలకు మాత్రమే ఇవ్వాలని, రోడ్లపై, గెడ్డల్లో పడేస్తే జరిమానా విధించాలని, ఒకవేళ వాహనాలు ఇళ్లకు వెళ్లకపోతే సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


కమిటీ సభ్యులకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

ఆలయ నిర్మాణానికి విరాళం

అగనంపూడి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పెదమడకలో చేపడుతున్న రామాలయం నిర్మాణానికి పట్టా రామఅప్పారావు దంపతులు రూ.25 వేలను ఆలయ కమిటీ ప్రతినిధులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిఇక గతంలో రూ.50 వేలు విరాళాన్ని అందించామని, ఆలయానికి భవిష్యత్తులో ఆలయ అభివృద్ధికి తమ సహకారం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని వినతి

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు తక్షణమే వేతన బకాయిలను చెల్లించాలని ఇంటక్ చీఫ్ ప్యాట్రన్ మంత్రి రాజశేఖర్ ఉక్కు యాజమాన్యానికి గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో ఇంటక్ సహకారంతో సాధించుకున్న ఆర్థిక ప్రయోజనాలకు గండి పడిందని, వీటిని పునఃప్రారంభించాలని కోరారు. అదే విధంగా టౌన్‌షిప్ క్వార్టర్స్‌లో నివాసముంటున్న వారికి విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరారు.

శ్రీవారికి తిరుప్పావడ సేవ


తిరుప్పావడ సేవలో పాల్గొన్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : షీలానగర్‌లోని బాలాజీ దివ్యక్షేత్రంలో గురువారం నిర్వహించిన తిరుప్పావడ సేవ భక్తులను ఎంతో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 25 కేజీల పులిహోరను స్వామివారి ఆకారంలో రాశిగా పోసి పూలు, పండ్లతో, వివిధ రకాల మిఠాయిలతో అలంకరించారు. అనంతరం భక్తులకు నిజరూప దర్శనం కల్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలో పాలక మండలి సభ్యులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదు'

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల్లో ఏ ఒక్కరిని విధుల నుంచి తొలగించరాదని కార్మిక సంఘ నాయకులు యాజమాన్యాన్ని కోరుతున్నారు. గతంలా కాకుండా ఇప్పుడు రోజుకు 20 నుంచి 30 మంది వరకు కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తున్నారని ఆరోపించారు. ఎన్నో ఏళ్లగా ప్లాంట్‌లోని విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులను ఒక్కసారిగా తొలగించడం సరికాదని, ఉక్కు యాజమాన్యం మానవత్వంతో ఆలోచించాలని నాయకులు కోరుతున్నారు.

సినిమా గైడ్

- **కానిస్టేబుల్** : జగదాంబ, రమాదేవి,
- **బల్టీ** : గోకుల్
- **కాంతార 2**: మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2(104 ఏరియా),నరసింహ(గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజీ**: శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1, 2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: జగదాంబ, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఇడ్లీ కొట్టు** : శ్రీ వెంకటేశ్వర, రమాదేవి

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 25, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 34, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 30, బీరకాయలు 34, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 20, క్యారెట్ 58, దొండకాయలు 30, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 68, అల్లం (పాతది) 70, బరబాటి 40, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో)50, బద్దచిక్కుడు 60, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 56, కీరదోస 28, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 36, కంద 36, గోరు చిక్కుడు 40, కూరపెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు60, బూడిదగుమ్మడి కాయ 20, కర్రపెండలం 22, మామిడిఅల్లం 90, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

గాజువాకలో బాణసంచా విక్రయాలకు ఏర్పాట్లు

- మూడుచోట్ల స్టాల్స్ ఏర్పాటు
- అనుమతి లేకుండా దుకాణాలను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు: సీఐ పార్థసారథి


గాజువాక ఆదర్శ మైదానంలో ఏర్పాటు చేస్తున్న స్టాళ్లు

గాజువాక, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో మూడుచోట్ల బాణసంచా విక్రయాలు చేపట్టేందుకు అధికారులు స్థలాలను కేటాయించారు. నక్కవానిపాలెంలో, షీలానగర్‌లో శాశ్వత దుకాణంతో పాటు మరికొన్ని బాణసంచా స్టాల్స్, ఆదర్శ మైదానంలో బాణసంచా విక్రయాల స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. అయితే స్థలాల కేటాయింపు జరిగినప్పటికీ అగ్నిమాపక, జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసుల విభాగాల నుంచి అనుమతులు పొందిన వారికి మాత్రమే దుకాణాలను ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు ఇస్తున్నట్టు పోలీస్ అధికారులు స్పష్టం చేశారు. ఆదర్శ మైదానంలో సుమారు 50 స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ క్రమంలో పలువురు వ్యాపారులు షెడ్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. నక్కవానిపాలెంలో కూడా సుమారు 30 నుంచి 40 దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. దీపావళికి మూడు రోజులే సమయం ఉన్నందున ఒకటి రెండు రోజుల్లో అనుమతులు పొందిన వారికి స్టాళ్లను కేటాయించనున్నారు. ఇదిలా ఉండగా అనుమతులు లేకుండా అనధికారికంగా బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేసేందుకు పలువురు సిద్ధపడుతున్నట్టు తెలిసింది. ఎవరైనా ఎటువంటి అనుమతులు లేకుండా బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ పార్థసారథి హెచ్చరించారు.

నిబంధనలను పాటించాలి: పెందుర్తి సీఐ సతీశ్‌కుమార్

పెందుర్తి: దీపావళి పండగ సందర్భంగా బాణసంచా విక్రయదారులు నిబంధనలను ఉల్లంఘిస్తే తగిన చర్యలు తీసుకుంటామ ని పెందుర్తి సీఐ కేవీ సతీశ్‌కుమార్ హెచ్చరించారు. ముందుగుండు నిల్వ, అనధికార విక్రయాల బాధ్యులపై కేసులు నమోదు చేస్తామన్నారు. బాణసంచా విక్రయ దుకాణాలకు తప్పనిసరిగా అనుమతులు ఉండాలని స్పష్టం చేశారు. స్టాల్స్ మధ్య కనీస దూరాన్ని పాటించాలని, అందరూ పోలీసులకు సహకరించాలని సూచించారు.

సంపూర్ణ ఆరోగ్యానికి జాగ్రత్తలు తప్పనిసరి

- ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి డి.నీలవేణి


సామూహిక సీమంతాల్లో పాల్గొన్న డి.నీలవేణి

పెదగంట్యాడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆరోగ్య విషయంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి డి.నీలవేణి అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పలువురు గర్భిణులకు గురువారం పెదగంట్యాడ అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెందుర్తి ఐసీడీఎస్ పరిధిలో సెప్టెంబరు 16 నుంచి అక్టోబరు 16 వరకూ రాష్ట్రీయ పోషణ కార్యక్రమాలు జరిగాయని, అందులో భాగంగానే సామూహిక సీమంతాలు నిర్వహించామని తెలిపారు. అనంతరం మహిళల సంక్షేమానికి, బాలికల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వివరించారు. బాలికలకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపం భావితరాలకు శాపం

పెందుర్తి, (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహార లోపం భావి తరాలకు శాపమని ఎంపీపీ మధుపాడ నాగమణి అన్నారు. పెందుర్తిలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో గురువారం రాష్ట్రీయ పోషణ మాసం ముగింపు ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్‌వాడీ 20 మంది గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ ఆధారిత వివక్ష కారణంగా కొన్ని ప్రాంతాల్లో ఆడపిల్లలు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారని అన్నారు. అనంతరం ప్రోటీన్ ఫుడ్‌పై అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. గర్భిణులకు, ఆడపిల్లలకు పౌష్టికాహారాన్ని అందజేయాల్సిన బాధ్యత అంగన్‌వాడీలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో నీలవేణి, సూపర్‌వైజర్లు గీత, మానస లక్ష్మి పాల్గొన్నారు.

87వ వార్డులో 'సేవ్ గర్ల్ చైల్డ్' ర్యాలీ


ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, వైద్య సిబ్బంది, తదితరులు

కూర్మన్నపాలెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని, చట్టరీత్యా కఠిన శిక్షలు పడతాయని కణితి పీహెచ్‌సీ ఆరోగ్య అధికారి బాబీ పేర్కొన్నారు. 87వ వార్డు కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, పీహెచ్‌సీ సిబ్బంది, వర్కర్ల ఆధ్వర్యంలో 'సేవ్ గర్ల్ చైల్డ్' ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లకార్డులు పట్టుకుని, నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఆడపిల్లలను రక్షించాలని, చదివించాలని, బాలికల సాధికారత, రక్షణ, విద్య తదితర విషయాల్లో అభివృద్ధి చెందేలా చూడాలంటూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ విద్యార్థులకు ఉద్యోగాలు

- ఇన్ఫోసిస్‌కు 228 మంది ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య

అగనంపూడి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు క్రమశిక్షణ, నాణ్యమైన విద్యాబోధన చేయడం వల్లే ఉద్యోగాలు సాధిస్తున్నారని విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య పేర్కొన్నారు. ప్రముఖ ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్‌కు సిస్టం ఇంజనీర్ రోల్‌కు 228 మంది విద్యార్థులు రూ.3.6 లక్షల వార్షిక వేతనంతో ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు గురువారం ఆయన అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇన్ఫోసిస్ వంటి సంస్థలో ఒకే సారి 228 మంది విద్యార్థులకు ఉద్యోగాలు సాధించడం విద్యా సంస్థకు గర్వకారణమన్నారు. అధ్యాపకులు అంకిత భావంతో బోధన చేయడం, విద్యార్థుల కృషితోనే ఉద్యోగాలు సాధించామని తెలిపారు. తమ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందించాలన్న లక్ష్యంతో విజ్ఞాన్ విద్యా సంస్థలు కృషి చేస్తున్నాయని, పరిశ్రమల అవసరాలకు తగినట్టు సాంకేతిక నైపుణ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ అభివృద్ధికి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, ప్లేస్‌మెంట్ అధికారి బోడె ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణతకు ఎంఈవోల గ్రామసందర్శన


గ్రామ సందర్శనలో పాల్గొన్న ఎంఈవోలు సోమేశ్వరరావు, దివాకర్

గోపాలపట్నం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): టెన్త్ విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించడానికి చేపడుతున్న గ్రామసందర్శన గోపాలపట్నం మండలంలోని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానియ జడ్పీ హైస్కూల్‌లో విద్యాభ్యాసం చేస్తున్న పదోతరగతి విద్యార్థుల ఇళ్లను ఎంఈవోలు సోమేశ్వరరావు, దివాకర్, ఏపీవో అప్పలనాయుడు, హైస్కూల్ హెచ్ఎం వేణుగోపాల్ సందర్శించారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలంటే కృషి పట్టుదలతో చదవాలని, వారి చదువుపై తల్లిదండ్రులు కూడా వ్యక్తిగత శ్రద్ధ చూపాలని సూచించారు.

పది పరీక్షలపై విద్యార్థులకు సూచనలు

వేపగుంట, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వుల మేరకు 10వ తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల ఇళ్లను గురువారం రాత్రి స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు సందర్శించారు. ఈ సందర్భంగా వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పదోతరగతి పరీక్షలకు ఏ విధంగా ప్రణాళికను సిద్ధం చేసుకోవాలో విద్యార్థులకు, తల్లిదండ్రులకు హెచ్ఎం. కమలకుమారి వివరించారు. అనంతరం విద్యార్థుల సందేహాలకు పరిష్కారాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష నుంచి ఏఎల్ఎన్.శ్రీనివాసరవు, సింహాచలం నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'అవగాహనతోనే చోరీల నియంత్రణ సాధ్యం'


అవగాహన కల్పిస్తున్న క్రైం ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళి

గోపాలపట్నం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే చోరీల నియంత్రణ సాధ్యమని వెస్ట్‌జోన్ క్రైం ఇన్‌స్పెక్టర్ ఎం.చంద్రమౌళి అన్నారు. నేరాల నియంత్రణపై స్థానిక రైతుబజార్‌లో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రద్దీగా ఉన్న ప్రాంతాల్లో జేబు దొంగతనాలు, సెల్‌ఫోన్ దొంగతనాలు, స్త్రీల మెడలోని బంగారు ఆభరణాలు చోరీ జరిగే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ క్రమంలో రద్దీగా ఉండే ప్రదేశాలకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉంటే చోరీ జరిగే అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. విలువైన ఆభరణాలు, పెద్ద మొత్తంలో నగదు బ్యాగుల్లో పెట్టుకుని ప్రయాణాలు చేయడం మంచిదికాదని సూచించారు. ఈ సందర్భంగా దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జి.తేజేశ్వరరావు, స్టేషన్ సిబ్బంది, రైతుబజార్ ఈవో ప్రసాద్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో పరిశ్రమలు పెరుగుతున్నాయి

- తెలుగు యువత జిల్లా కార్యదర్శి మొల్లి పెంటిరాజు

గాజువాక, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పరిశ్రమలు వస్తున్నాయని, దీని వల్ల యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని తెలుగు యువత జిల్లా కార్యదర్శి, రాష్ట్ర గ్రీనరీ, బ్యూటిఫికేషన్ డైరెక్టర్ మొల్లి పెంటిరాజు అన్నారు. గాజువాక టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెదగంట్యాడలో నివాస ప్రాంతాలకు దగ్గరగా అంబుజా సిమెంట్ పరిశ్రమను స్థానికులు వ్యతిరేకిస్తున్నారని, దీనిని స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కలిసి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజలు ఇష్టపడని ఏ పనిని ప్రభుత్వం చేయదన్నారు. స్థానిక ప్రజల ఆంకాంక్షలు, అభిప్రాయాలను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఇప్పటికే ప్రభుత్వానికి వివరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు ఎం.గణపతి, ప్రధాన కార్యదర్శి వి.నరేశ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మానవీయ విలువలపై అవగాహన

గోపాలపట్నం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో కూడిన విద్యాభ్యాసంతోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించగలరని దామోదరం సంజీవయ్య లా యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ వై.సత్యనారాయణ అన్నారు. విశాఖ ఇంజనీరింగ్ కళాశాల (అటానమస్)లో విద్యాభ్యాసంలో మానవీయ విలువలపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైతిక విలువలు, సామాజిక స్పృహతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగితే మెరుగైన సమాజ స్థాపన సాధ్యమని అన్నారు. ఏ వృత్తిలో కొనసాగినా మానవీయ విలువలకు ప్రాధాన్యమిస్తూ ఆదర్శనీయులుగా మెలగాలని కోరారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వై.సత్యనారాయణను కళాశాల చైర్మన్ జి.సత్యనారాయణ, అధ్యాపకులు సన్మానించారు.

'ప్లాంటుకు ప్రభుత్వాలు సాయం చేయడం హర్షణీయం'

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌కు విద్యుత్, నీటి సరఫరాకు రూ.2400 కోట్లు ఆర్థిక సాయం చేసేందుకు ఆదేశాలు జారీ చేయడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉక్కు అధికారుల సంఘం అధికారి కేవీడీ. ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7 శాతం వడ్డీతో 10 సంవత్సరాల వరకూ తీసుకునేటట్టు, ఆతరువాత ఆ మొత్తాన్ని ప్రిఫరెన్షియల్ షేర్ కింద మార్చుకునే విధంగా ఆదేశాల ఇవ్వడం హర్షణీయమని అన్నారు. ఈ విషయంలో రెండేళ్లగా రాష్ట్ర ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగే ప్రాజెక్టులకు విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తులను వినియోగించాలని కోరారు. ప్లాంట్‌కు ఇనుప ఖనిజం సరఫరా సమస్య తీరాలంటే సెయిల్‌లో విలీనం చేయాలని కోరారు.

జీవీఎంసీకి రూ.48.21 లక్షలు జమ చేశాం

- కాంక్రీట్ గోడ కూల్చివేతకు అయిన ఖర్చు చెల్లించాం
- హైకోర్టుకు నివేదించిన నేహారెడ్డి, అవ్యాన్ రియల్టర్స్
- తదుపరి విచారణ వాయిదా

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా భీమునిపట్నం పరిధిలో సీఆర్‌జడ్ నిబంధనలకు విరుద్ధంగా సముద్రానికి అతి సమీపంలో నిర్మించిన కాంక్రీట్ గోడను కూల్చేందుకు అయిన రూ.48.21 లక్షల ఖర్చును జీవీఎంసీ వద్ద జమ చేశామని వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి, ఆమె కంపెనీ అవ్యాన్ రియల్టర్స్ ఎల్ఎల్‌పీ గురువారం హైకోర్టుకు నివేదించారు. అందుకు సంబంధించిన వివరాలను ధర్మాసనం ముందు ఉంచారు. ఈ వివరాలు నమోదు చేసిన ధర్మాసనం.. కాంక్రీట్ నిర్మాణంతో ప్రకృతికి నష్టం చేసినందుకు గాను కంపెనీ నుంచి రూ.17.46 కోట్ల నష్ట పరిహారం రాబట్టాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ నేతృత్వంలోని కమిటీ ఇచ్చిన నివేదికపై స్పందన తెలపాలని అవ్యాన్ రియల్టర్స్ ఎల్ఎల్‌పీని ఆదేశించింది. గోడ కూల్చివేతకు అయిన ఖర్చును చెల్లించిన నేపథ్యంలో, కూల్చివేయకుండా మిగిలి ఉన్న గోడను కూడా తొలగించాలని జీవీఎంసీని ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. భీమునిపట్నం పరిధిలోని సీఆర్‌జడ్-1 ప్రాంతంలో సముద్రానికి అతి సమీపంలో నేహారెడ్డి, ఆమె కంపెనీ అవ్యాన్ రియల్టర్స్ ఎల్ఎల్‌పీ శాశ్వత కాంక్రీట్ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని పేర్కొంటూ జనసేన కార్పొరేటర్ పీఎల్‌వీఎన్ మూర్తి యాదవ్ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. సీఆర్‌జడ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన నాలుగు రెస్టోబార్లను తొలగించడంతో పాటు సహజ ఆవాసాలను పునరుద్ధరించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా కాంక్రీట్ గోడను కూల్చేందుకు అయిన ఖర్చును జీవీఎంసీ వద్ద జమ చేయాలని నేహారెడ్డి, అవ్యాన్ రియల్టర్స్ ఎల్ఎల్‌పీని ధర్మాసనం ఆదేశించిన విషయం తెలిసిందే.

'ఏపీఐఐసీ ఇండస్ట్రీ పార్టనర్‌షిప్ డ్రైవ్' ప్రారంభం

ఆటోనగర్,అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతే ధ్యేయంగా ఏపీఐఐసీ ఇండస్ట్రీ పార్టనర్ షిప్ డ్రైవ్‌ను ఆటోనగర్‌లో గురువారం ఐలా కమిషనర్ కిశోర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని అక్టోబరు 15 నుంచి నవంబరు 15 వరకూ నిర్వహిస్తామన్నారు. ఏపీఐఐసీ పారిశ్రామిక పార్కులను వ్యర్థాలను తొలగించడం, రహదారులను శుభ్రంగా ఉంచడం, స్థిరత్వం, భద్రత, పెట్టుబడిదారుల సంసిద్ధత ఆధునిక ప్రమాణాలకు అనుగుణంగా అప్‌గ్రేడ్ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. పారిశ్రామిక ప్రాంతంలో పరిశుభ్రత, పచ్చదనం, నీరు, ఇంధన సామర్థ్యం, పౌర మౌలిక సదుపాయాలను మెరుగు పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐలా సెక్రటరీ చీకటి సత్యనారాయణ, మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నల్లూరు సూర్యనారాయణ

ప్రభుత్వ విజయాలను ప్రజలకు తెలియజేయాలి

- 86వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ

కూర్మన్నపాలెం,అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి కూటమి నాయకుడిపై ఉన్నదని 86వ వార్డు టీడీపీ అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ అన్నారు. 86వ వార్డు టీడీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గూగుల్ రాకతో విశాఖ ఖ్యాతి విశ్వవ్యాప్తంగా విస్తరించనున్నదని అన్నారు. గూగుల్ డేటా సెంటర్ ద్వారా యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సూపర్ జీఎస్టీ..సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి జీఎస్టీపై అవగాహన కల్పించి, కరపత్రాలను పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు వేగుంట శ్రీనివాస్, కె.రమేశ్, బి. జగదీశ్, నాగార్జున, కె.వెంకటసుబ్బయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

అగనంపూడి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు శివాజీనగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేషన్‌కు పన్నులు చెల్లిస్తున్నప్పటికీ కాలనీలోని అభివృద్ధి జరగడం లేదని కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లారు. డ్రైనేజీలు, వీధిలైట్లు, రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. ముఖ్యంగా తాగునీరు లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. దీనిపై స్పందించిన కార్పొరేటర్ సమస్యల పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాలనీలో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు కరణం జగదీశ్, రామ్మోహన్‌రావు, గల్లా రుద్రకుమార్, సింగిడి సింహాచలం, ఏఈ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీ బస్సులతో ట్రాఫిక్ ఇబ్బందులు


జంక్షన్‌లో క్యూ కట్టిన ఫార్మాసిటీ బస్సులు

గాజువాక, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ బస్సుల వల్ల పాతగాజువాక జంక్షన్‌లో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయి. ఈ జంక్షన్ ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు పోలీసులు గతంలో అధికారులు చర్యలు చేపట్టి సమూల మార్పులు చేపట్టారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తొలిగాయి. అయితే ఇప్పుడు ఫార్మాసిటీ బస్సుల మూలంగా ట్రాఫిక్ కష్టాలు మరింతగా పెరిగాయి. సుమారు రెండు వందలపైగా బస్సులు నిత్యం రాకపోకలు సాగించడంతో ట్రాఫిక్ సమస్య పెరిగింది. ఉదయం 4:30 నుంచి 5:30 వరకు, 7నుంచి 8:30, మధ్యాహ్నం 12:30 నుంచి 1:30 వరకు, రాత్రి 8:30 నుంచి 9:30 వరకు ఇలా ఉదయం నుంచి రాత్రి వరకూ తిరుగుతుండడంతో కూర్మన్నపాలెం నుంచి పాతగాజువాక మార్గంలో బస్సులు బారులు తీరుతున్నాయి. అన్ని బస్సులు ఒకేసారి రావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు మరింత పెరుగుతున్నాయి.

'సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్'పై ఆటో ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న ఆటో కార్మికులు

పెందుర్తి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై పెందుర్తి జంక్షన్‌లో గురువారం ఆటో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అన్ని రకాల వాహనాలు, నిత్యావసర వస్తువులు, మెడికల్ కొనుగోళ్లపై ప్రస్తుతం ఉన్న రేట్లకు గత ఏడాది రేట్లకు వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించారు. ఈ క్రమంలో కిరాణా సామగ్రి కొనుగోలులో 13 శాతం తగ్గింపు, మందులకు జీరో శాతం, ట్రాక్టర్ల కొనుగోలులో 5 శాతం జీఎస్టీ వసూళ్లు, ఎలక్ట్రానిక్ వస్తువులపై సేవింగ్స్‌ను వివరించారు. ఈ సందర్భంగా సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై తగ్గింపు ధరల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమలో గవర కర్పొరేషన్ డైరెక్టర్ వేగి పరమేశ్వరరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వేది దివాకర్, ఎంపీడీవో గుండు అప్పలరాజు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, జీఎస్టీ అధికారి కృష్ణవేణి, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటు రోడ్లలో కారు డ్రైవింగ్ శిక్షణ

- పోలీసులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఉన్న రోడ్లు డ్రైవింగ్ శిక్షణకు కేంద్రాలుగా మారాయి. పారిశ్రామిక ప్రాంతంలో వివిధ చోట్ల నుంచి కారు డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులు ఇక్కడకు వచ్చి డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నారు. కొంతమంది డ్రైవింగ్ స్కూల్ వాహనాల్లో శిక్షణ తీసుకుంటే, మరికొందరు మాత్రం సొంత వాహనాల్లో శిక్షణ తీసుకుంటున్నారు. ప్లాంటులో మార్గాల్లో ఎప్పుడు చూసినా డ్రైవింగ్ స్కూల్ వాహనాలే దర్శనమిస్తున్నాయి. వీటి వల్ల గతంలో ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. ప్లాంటు మార్గంలో డ్రైవింగ్ శిక్షణ వద్దని, దీనిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఉక్కు ఉద్యోగులు, కార్మికులు కోరుతున్నారు. స్టీల్ ప్లాంట్ మార్గంలో డ్రైవింగ్ శిక్షణ కార్లు తిరిగితే చర్యలు తీసుకుంటామని పోలీసులు చెప్పారు.

నేటి నుంచి అయ్యప్ప భక్తులకు అన్నసమారాధన

వేపగుంట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రహ్లాదపురం భరత్‌నగర్‌లోని శ్రీధర్మశాస్త్ర ద్రవిడ సేవా సంఘం పీఠం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి నవంబరు 26 వరకూ అయ్యప్ప స్వాములకు అన్నసమారాధన నిర్వహించనున్నట్టు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అన్నదానం రాపర్తి సుబ్బలక్ష్మి అమ్మ ఆశీస్సులతో నాలుగేళ్లగా అయ్యప్పకలు, భవానీలకు అన్నదానం చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.



ఎన్ఎస్‌టీఎల్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌పీ హరప్రసాద్

నౌకల రూపకల్పనలో సాంకేతికతను అనుసంధానం చేయాలి

» నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్ డైరెక్టర్ జనరల్ హరప్రసాద్

గోపాలపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను భవిష్యత్తు నౌకల రూపకల్పనలో అనుసంధానం చేయాల్సిన అవసరం అనివార్యమని నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్ డైరెక్టర్ జనరల్ ఆర్‌పీ హరప్రసాద్ అన్నారు. ఎన్ఎస్‌టీఎల్‌లో షిప్ డిజైన్ వర్క్‌షాప్ (ఎస్‌డబ్ల్యూడీ-25)ను గురువారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ, కార్యాచరణ ప్రమాణాలకు అనుగుణంగా నౌకల రూపకల్పనకు గ్రీన్‌షిప్ టెక్నాలజీ, ఇంధన సమర్థవంతమైన ప్రొపల్షన్ సిస్టమ్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ప్రముఖ విదేశీ హైడ్రోడైనమిక్ పరిశోధన సౌకర్యాలతో పోల్చదగిన షిప్ మోడల్ టెస్టింగ్, మూల్యాంకనలో ఎన్ఎస్‌టీఎల్ అంతర్జాతీయ నాయకుడిగా ఎదగాలని ఆకాంక్షించారు. నావికా వ్యవస్థల్లో ఆత్మనిర్భర్ సాధించడంలో స్వదేశీ నౌకల రూపకల్పన, ఆవిష్కరణలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. రియల్ అడ్మిరల్ సుజిత్ బాక్సీ మాట్లాడుతూ జాతీయ నౌకల రూపకల్పన పర్యావరణ వ్యవస్థలోని కీలక భాగస్వాములను ఒకే వేదికపైకి తీసుకువచ్చిన ఘనత ఎన్ఎస్‌టీఎల్‌కే దక్కుతుందన్నారు. నీటి అడుగున వ్యవస్థలు, ఓడ హైడ్రోడైనమిక్స్, స్టెల్త్ టెక్నాలజీలో ఎన్ఎస్‌టీఎల్ అందిస్తున్న సహకారాన్ని సంస్థ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ వివరించారు. కార్యక్రమంలో నావికాదళం, డీపీఎస్‌యూ, ప్రైవేట్ షిప్‌యార్డులు, వర్గీకరణ సంఘాలు, డిజైన్ హౌస్‌లు, పలు విద్యా సంస్థలు పాల్గొన్నాయి.



పీఎంపాలెంలో క్రికెట్ స్టేడియం ఎదురుగా టీడీపీ శ్రేణులు ఏర్పాటు చేసిన భారీ హోర్డింగ్

నగరంలో గూగుల్ ఫీవర్

విశాఖకు భారీ విదేశీ పెట్టుబడితో రావడానికి గూగుల్ కంపెనీ ఒప్పందం చేయడంతో నగరంలో పండుగ వాతావరణం నెలకొంది. కూటమి నాయకులు మంగళ, బుధవారాల్లో స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకోగా.. ఇప్పుడు తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఎక్కడికక్కడ భారీ హోర్డింగులను ఏర్పాటు చేసి తమ ఆనందాన్ని ప్రజలతో పంచుకుంటున్నాయి. నాడు మైక్రోసాఫ్ట్‌ను హైదరాబాద్‌కు సీఎం చంద్రబాబు తీసుకురాగా.. నేడు ఐటీ మంత్రి, చంద్రబాబు తనయుడు లోకేశ్ విశాఖకు గూగుల్ తెచ్చి అభివృద్ధిని పరుగులు తీయిస్తున్నారంటూ ఏర్పాటు చేసిన హోర్డింగులు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

-ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం



ప్రధాని సభకు ముస్లిం మహిళలు

సభకు వేలాది బస్సులు ఇలా...

మోదీతో చంద్రబాబు, పవన్

సభలో ఉప్పొంగిన దేశభక్తి

సభలో టీడీపీ మహిళా నేతలు

శివాజీ స్ఫూర్తి కేంద్రంలో మోదీ

పొలాల వెంబడి పరుగులు

నమో..జోష్

'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' పేరిట కర్నూలులో గురువారం జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన విజయవంతమైంది. శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఆయన తిరిగి కర్నూలుకు చేరుకున్నారు. ప్రధానితో పాటు సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ రావడంతో కూటమి శ్రేణులు భారీగా తరలివచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలతో సభాప్రాంగణం నిండిపోయింది. ఓర్వకల్లు మండలం కర్నూలు-నంద్యాల జాతీయ రహదారి పక్కన నన్నూరు రాగమయూరి వెంచర్‌లో ఏర్పాటు చేసిన ప్రధాని సభకు దాదాపు 3 లక్షల మందికి పైగా ప్రజలు తరలివచ్చారు. వేలాది వాహనాల్లో తరలి రావడంతో కర్నూలు కిక్కిరిసిపోయింది. ఇక సభావేదిక వద్ద తెలుగుదేశం పార్టీ యువత కదనోత్సాహం... జనసైనికుల ఆనందం.. బీజేపీ శ్రేణుల కోలాహలం.. వెరసి ప్రధాని సభ సూపర్ సక్సెస్ అయింది.

- కర్నూలు (ఆంధ్రజ్యోతి)

స్వర్ణాంధ్ర సాధనలో జీఎస్టీ 2.0 గొప్ప గేమ్ చేంజర్

» కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

» ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో గ్రేట్ వైజాగ్ షాపింగ్ ఫెస్టివల్ ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న హరేంధిర ప్రసాద్



ఓ స్టాల్‌లోని బైకును నడుపుతున్న కలెక్టర్

మద్దిలపాలెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థికాభివృద్ధిలో, స్వర్ణాంధ్ర సాధనలో జీఎస్టీ 2.0 గొప్ప గేమ్ చేంజర్‌గా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అన్నారు. ఈ శుభ పరిణామంతో భారతదేశం ప్రపంచం లోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై అవగాహనలో భాగంగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో గురువారం ది గ్రేట్ వైజాగ్ షాపింగ్ ఫెస్టివల్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం జీఎస్టీని తగ్గించడం చరిత్రాత్మక నిర్ణయమన్నారు. 1990లో ఎల్పీజీ (లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్)లా ఇది అనూహ్య ఫలితాలను ఇస్తుందనన్నారు. జీఎస్టీని నాలుగు స్లాబ్‌ల నుంచి రెండింటికి తగ్గించడం హర్షణీయమన్నారు. స్వర్ణాంధ్ర లక్ష్యాలను సాధించడంలో జీఎస్టీ 2.0 చుక్కానిలా ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రేట్ వైజాగ్ ఫెస్టివల్ మంచి ప్లాట్‌ఫామ్‌గా నిలుస్తోందన్నారు. ఈ నెల 19 వరకు జరిగే ఈ ఫెస్టివల్‌ను ప్రజలందరూ విజయవంతం చేయాలని హరేంధిర ప్రసాద్ కోరారు.

అనంతరం ఫెస్టివల్‌లో ఏర్పాటు చేసిన 60 స్టాళ్లను ఆయన సందర్శించి, నూతన జీఎస్టీ స్లాబ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఫెస్టివల్‌లో భాగంగా పలు రకాల స్టాళ్లను ఏర్పాటు చేశారు. జీఎస్టీ తగ్గింపు నేపథ్యంలో ఆయా స్టాళ్లను తిలకించేందుకు సందర్శకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్లు, ద్విచక్ర వాహనాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, గృహోపకరణాలు, ఫుడ్ స్టాల్స్ ఇక్కడ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర జీఎస్టీ అదనపు కమిషనర్ సీతారాం శేఖర్, జిల్లా పర్యాటక శాఖ అధికారిణి జె.మాధవి, యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యవేణి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మీపతి, జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

4 కిలోల గంజాయి స్వాధీనం



నిందితులతో ఆర్పీఎఫ్ అధికారులు, సిబ్బంది

విశాఖపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టుకుని వారినుంచి సుమారు 4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఉదయం ప్లాట్‌ఫామ్‌లపై ఆర్పీఎఫ్ సిబ్బంది తనిఖీలు చేస్తుండగా సలీం పాషా (31), అమ్ము కుట్టి (22), నిషా దేవి (33) అనే నిందితులు కోరాపుట్ నుంచి బెంగళూరుకు గంజాయి రవాణా తీసుకువెళుతూ పట్టుబడ్డారు. రైల్వే మార్గాల ద్వారా మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడంతో పాటు ప్రయాణికుల భద్రతకు రైల్వే రక్షణ దళం అధిక ప్రాధాన్యం ఇస్తుందని మర్రిపాలెం పోస్టు ఆర్పీఎఫ్ అధికారులు తెలిపారు.

రెండు రైళ్లకు అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని బెంగళూరు-నరంగి-బెంగళూరు మధ్య రాకపోకలు సాగించే 06559, 06560 నంబరు గల ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈ నెల 21 నుంచి 29 వరకు అదనంగా రెండు జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లను జత చేసినట్టు సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు.

పనిచేసిన ఇంటికే కన్నం

» మహిళతో పాటు ఆమెకు సహకరించిన సోదరి అరెస్టు

కూర్మన్నపాలెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తాను పని చేస్తున్న ఇంట్లోనే దొంగతనం చేసిన మహిళతో పాటు ఆమెకు సహకరించిన సోదరిని దువ్వాడ క్రైమ్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రెండున్నర తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. క్రైమ్ ఎస్ఐ నరసింహులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 86వ వార్డు రాజీవ్ నగర్‌లో నివాసం ఉంటున్న వి.నరసింగరావు ఇంట్లో అనకాపల్లి జిల్లా సోమలింగపు రానికి చెందిన కె.నాగమణి పని చేసేది.

ఈ నెల ఒకటిన నరసింగరావు కుటుంబ సభ్యులెవరూ ఇంట్లో లేని సమయంలో బీరువా తెరిచి బంగారు చెవిదిద్దులు, పచ్చల హారాన్ని నాగమణి తస్కరించింది. వాటిని తన చెల్లి మంగకు ఇచ్చి విక్రయించాలని చెప్పింది. చోరీ జరిగిన విషయాన్ని ఆలస్యంగా గమనించిన నరసింగరావు దువ్వాడ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నాగమణిని విచారించడంతో ఆమె నేరం అంగీకరించింది. ఈ మేరకు అక్కాచెల్లెళ్లను అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

అన్యాక్రాంతమైన వక్ఫ్ భూమి పరిరక్షణకు చర్యలు

అమరావతి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లాలో అన్యాక్రాంతమైన 319 ఎకరాల వక్ఫ్ భూములను పరిరక్షించేందుకు చర్యలు తీసుకున్నట్లు రాష్ట్ర వక్ఫ్ సర్వే కమిషనర్ షిరీన్ బేగమ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం జిల్లా పెద గంట్యాడ మండలం దేవాడలో అన్యాక్రాంతమైన వక్ఫ్ భూములను గుర్తించి సర్వే చేశామని, ఈ సర్వేలో 319 ఎకరాల 10 సెంట్ల భూమి ఎన్‌టీపీసీ సంస్థ ఆధీనంలో ఉందని గుర్తించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్యాక్రాంతమైన వక్ఫ్ భూములు మొత్తం 479 ఎకరాలను పరిరక్షించినట్లు తెలిపారు.

వివాహిత హత్య కేసులో నిందితుడి అరెస్టు

» గంటల వ్యవధిలోనే అదుపులోకి తీసుకున్న సిబ్బందిని అభినందించిన సీపీ, డీసీపీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ లక్ష్మణమూర్తి

సీతమ్మధార, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం నందగిరినగర్‌లో వివాహితను నడిరోడ్డుపై హతమార్చిన వ్యక్తిని పోలీసులు కొద్ది గంటల వ్యవధిలోనే చాకచక్యంగా పట్టుకున్నారు. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ లక్ష్మణమూర్తి వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. శ్రావణ సంధ్య అలియాస్ సోనూ (33)కు తొమ్మిదేళ్ల క్రితం రాయగడకు చెందిన మణికంఠతో వివాహమైంది. వీరికి ఇద్దరు కవల కుమారులు. అయితే మానసిక వైకల్యంతో కుమారులు పుట్టడంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగేవి. దీంతో ఏడేళ్లుగా వారు విడిగా ఉంటున్నారు. నందగిరినగర్‌లో సోనూ ఒక కుమారుడితో ఉంటుంది. మరో కుమారుడు హాస్టల్‌లో ఉంటున్నాడు. సోనూకు, సమీపంలో ఉంటున్న కార్పెంటర్ కండిపిల్లి శ్రీనివాస్‌కు మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. 8 నెలల క్రితం సోనూ తమ ఇంటి వద్ద పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహన సీటును కోయడంతో పాటు హెడ్ లైట్లను శ్రీనివాస్ పగులగొట్టాడు. అప్పుడు వారిద్దరి మధ్య పెద్ద గొడవ జరిగింది. దీనిపై ఆమె ఫోర్త్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు కూడా చేసింది. అయితే ఆమె వాహనాన్ని శ్రీనివాస్ బాగు చేయించడంతో పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదును ఆమె వెనక్కు తీసుకుంది. అప్పటినుంచి ఇరువురి మధ్య చిన్న చిన్న గొడవలు జరుగుతూనే ఉన్నాయి. బుధవారం కూడా గొడవ జరగడంతో వాకింగ్‌కు వెళుతున్న సోనూ పీకను శ్రీనివాస్ పదునైన చాకుతో కోయడంతో అక్కడికక్కడే మృతి చెందింది. అక్కడనుంచి పారిపోయిన శ్రీనివాస్‌ను రైల్వేస్టేషన్ సమీపంలో సీఐ సీహెచ్ ఉమాకాంత్ ఆధ్వర్యంలో సిబ్బంది చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి గురువారం నిందితుడిని అరెస్టు చేశారు. కాగా ఇద్దరి మధ్య పాత గొడవలతో పాటు తాను వేరే అమ్మాయితో తరచూ మాట్లాడడాన్ని సహించలేక సోనూ గొడవ పడేదని, అందువల్లే పీక కోసి హతమార్చానని నిందితుడు శ్రీనివాస్ తెలిపినట్టు ఏసీపీ లక్ష్మణమూర్తి తెలిపారు. హత్య జరిగిన కొద్ది గంటల్లోనే నిందితుడిని పట్టుకున్న సీఐ ఉమాకాంత్, సిబ్బందిని సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, డీసీపీ-1 మేరీ ప్రశాంతి అభినందించినట్టు ఏసీపీ పేర్కొన్నారు.